భూ.. మాయగాళ్లు


ఉక్కాయపల్లిలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమి



- తప్పుడు రిజిస్ట్రేషన్లతో రెవెన్యూకే సవాల్
- కడపలోనే 3 వందల ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములు కబ్జా
- ఇప్పుడు ఫ్రీహోల్డ్ కోసం పైరవీలు

కడప నగరంలో భూ.. మాయగాళ్లు బరితెగించేశారు. తప్పుడు రిజిస్ట్రేషన్లతో రెవెన్యూ యంత్రాంగానికే పెద్ద సవాల్ విసిరారు. నివాసం ఉండేందుకు పేదలు రెండు సెంట్లు ఆక్రమిస్తే కూల్చేసే అధికారులు.. కళ్లెదుటే పదుల సంఖ్యలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నా మాకెందుకు అన్నట్లు నిమ్మకుండిపోయారు. ఒక్క కడపలోనే దాదాపు 300-400 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములు కబ్జా కోరల్లో చిక్కుకోవడంతో ప్రస్తుతం ఇదో హాట్ టాపిక్‌లా మారింది. ఇప్పుడు ఫ్రీహోల్డ్ కోసం పైరవీలు చేస్తూ అందినకాడికి దోచుకునేందుకు భూచోళ్లు సిద్ధంగా ఉన్నారు.

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పేదల ఆర్థిక భరోసాకిచ్చిన ప్రభుత్వ భూములు జిల్లాలో వేలాది ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయి. 1956 నుంచి 2024 వరకు పలు దఫాలుగా పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వ భూములు పంపిణీ చేసింది. ఇప్పటివరకు 10 విడతల్లో భూ పంపిణీ జరుగగా, దాదాపు 50-60 వేల ఎకరాల వరకు పేదలకు ప్రభుత్వ భూములు పంచారు. అయితే ఆ భూముల్లో అనాధిగా బడాబాబులు, అగ్రకులాల కబ్జా కోరల్లో మూడో వంతు భూములు సాగులో ఉండగా, ఒక వంతు భూములు పేదల వద్ద ఉండడం గమనార్హం. ఇక కడప మండల పరిధిలో ప్రభుత్వ భూముల వ్యవహారం చూస్తే 1970 నుంచి 96 వరకు ఎస్సీ, ఎస్టీలకిచ్చిన భూములు ఇప్పుడు బడాబాబులు, అగ్రకులాల కబంధ హస్తాల్లో ఉన్నాయి. అప్పుడు ఊరికి శివారున వేల రూపాయిలు విలువ చేయని భూములు ఇప్పుడు ఎకరా రూ.3 కోట్ల ధర పలుకుతున్నాయి. దాదాపు కడపలోనే 300-400 వందల ఎకరాలకు పైబడి ప్రభుత్వ భూములు తప్పుడు రికార్డులతో సహకార బ్యాంకులు, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖలకు టోకరా కొట్టి కోట్లాది రూపాయల భూములు కొల్లగొట్టి పెద్ద స్కామ్ చేశారు. దొరికితే దొంగ- దొరక్కపోతే దొరలన్నట్లుగా చలామణీ అవుతూ రెవెన్యూకే సవాలుగా మారారు.

ఉక్కాయపల్లి, గూడురు, చిన్నచౌకుల్లోనే భూచోళ్లు

కడప మండల పరిధిలో 7 రెవెన్యూ గ్రామాలు కడప, ఉక్కాయపల్లి, చిన్నచౌకు, పాత కడప, రామరాజుపల్లి, గూడురు గ్రామ పొలం, చెమ్ముమియాపేటలున్నాయి. ఈ ప్రాంతాల్లో పలు దఫాలుగా 1956 నుంచి 1971-96 వరకు పేదలకు భూములు పంపిణీ చేశారు. అప్పట్లో భూములు ఊరి శివారు ప్రాంతాల్లో ఉండడంతో పేదలు పొట్ట పోసుకోవడమే కష్టమైన రోజుల్లో ఆ పొలాలను సాగు చేయలేక అగ్రకులాల రైతులకు కౌలుకు అప్పగించారు. ఆ నాడు ఎకరా భూమి వేలాది రూపాయలుగా ఉండేది. నగరం విస్తరించడంతో నేడు అదే ఎకరా భూమి ధర అక్షరాల రూ.3-5 కోట్ల మధ్య పలుకుతోంది. అలాంటి ప్రభుత్వ భూములన్నీ పెద్దల చేతుల్లో వివాదాస్పద రిజిస్ట్రేషన్లు జరిగి రెవెన్యూ యంత్రాంగానికి తలనొప్పిగా మారింది. ఉక్కాయపల్లిలో 2006-07 మధ్యకాలంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో రాజీవ్‌గృహకల్ప కింద దాదాపు 175 ఎకరాల భూసేకరణ జరిగింది. అప్పట్లో ఆ భూముల్లో వైఎస్సార్ లే అవుట్, టిడ్కో ఇళ్లకు ఆ భూముల్లో కొంత భాగంగా ఉపయోగించారు. మిగిలిన భూముల్లో ఏళ్ల తరబడి నిర్మాణాలు జరగక పోవడంతో పాత తప్పుడు రికార్డులతో కొన్ని భూములను అడ్డగోలుగా రిజిస్ట్రేషన్లు చేసుకున్న ఉద్ధండ పిండాలు లేకపోలేదు. చాలదన్నట్లు అప్పట్లో నష్టపరిహారం ఎకరాకు రూ.6 లక్షలు ప్రభుత్వం ప్రకటించింది. కొందరు అందుకు అంగీకరించక కోర్టు మెట్లెక్కి భూములను నేటికి సాగు చేసుకుంటూ ఫ్రీహోల్డ్ కోసం రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. గతంలో ఉన్న తహసీల్దార్లు ప్రభుత్వ భూములని తెలిసినా కూడా కబ్జాదారులతో చేతులు కలిపి తప్పుడు పత్రాలతో ఏకంగా ఉక్కాయపల్లి పొలాల్లో ఆన్‌లైన్ చేసి ప్రభుత్వ నిబంధనలకు పంగనామాలు పెట్టారనే విషయం రెవెన్యూ రికార్డుల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

డిస్‌ప్యూట్ రిజిస్ట్రేషన్లలో కడప టాప్

కడపలో ప్రభుత్వ భూములను డిస్‌ప్యూట్ రిజిస్ట్రేషన్లు చేయడంలో టాప్ అనే చెప్పాలి. 2004-14 కాంగ్రెస్ కాలంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో కడపలో ప్రభుత్వ, మిగులు, స్తోత్రియం భూములు, చుక్కలు, పట్టాభూములు సైతం పెద్ద ఎత్తున అక్రమ పద్ధతిలో తప్పుడు రికార్డులతో దాదాపు వెయ్యి ఎకరాలకు వివాదాస్పదమైన రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ఆరోపణలున్నాయి. అప్పట్లో నిబంధనలకు పాతర వేస్తూ సబ్‌రిజిస్ట్రార్లతో కుమ్మక్కై రిఫ్యూజల్ ఆర్డర్‌తో పెండింగ్ రిజిస్ట్రేషన్లు చేసుకోవడం, కోర్టు మెట్లెక్కి డాక్యుమెంట్ రిలీజ్ చేసుకోవడం పెద్ద స్కామే జరిగిందని చెప్పవచ్చు. వ్యూహాత్మకంగానే పేదలకు పదో పరక ఇవ్వడం, అగ్రిమెంట్లు రాసుకోవడం, తప్పుడు పత్రాలు సృష్టించి కడపల్లోని కో ఆపరేటివ్ బ్యాంకుల్లో తనఖాలు పెట్టడం జరిగేది. అదే భూమిని గుట్టుచప్పుడు కాకుండా వేలంలో దక్కించుకోవడం, వివాదాస్పద రిజిస్ట్రేషన్లు చేసుకున్న భూచోళ్ల స్కామ్‌కు అడ్డూ అదుపు లేదంటారు. ఇకపోతే గూడూరు పొలంలో దాదాపు 60 ఎకరాలు, ఉక్కాయపల్లిలో చెరువును సైతం వదలకుండా 30 ఎకరాల వరకు, పుట్లంపల్లిలో 40 ఎకరాలు ఇలా అన్ని రెవెన్యూ గ్రామాల్లో ప్రభుత్వ భూములు వివాదాస్పద రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తెలుస్తోంది. ఇందుకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అప్పట్లో రెవెన్యూ అధికారుల అండదండలు ఉన్నాయంటారు. ఏదేమైనా భూముల తప్పుడు రిజిస్ట్రేషన్లు రద్దు చేసి పేదల ఇళ్లకు, ఇతర అవసరాలకు కేటాయిస్తే బాగుంటుందని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు

ప్రభుత్వ భూములు అమ్మడం, కొనడం చట్టరీత్యా నేరం. గతంలో పేదలకు పంచిన భూములు ఇతరులు తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్లు చేసుకున్నప్పటికీ ఎప్పటికీ వారి సొంతం కావు. ప్రభుత్వ అవసరాలకు ఉపయోగకరంగా ఉంటే ఆ భూములను తీసుకోవడం జరుగుతుంది. తప్పుడు పత్రాలతో భూములు ఆక్రమించేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

- నారాయణరెడ్డి, తహసీల్దారు, కడప

పసుపురంగు తొలగించండి

- మంత్రి నారా లోకేశ్

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన వాహనాలపై పసుపురంగు తొలగించండి, విద్యారంగాన్ని రాజకీయాలకు దూరంగా ఉంచాలని మంత్రి నారాలోకేశ్ సూచించినట్లు సమాచారం. సీకేదిన్నె హైస్కూల్లో మంగళవారం అధునాతన అడ్వాన్స్‌డ్ స్మార్ట్ కిచెన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సమీప పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తరలించే వాహనాలపై పసుపు రంగు ఉండడాన్ని గమనించిన ఆయన వెంటనే ఆ రంగు మార్చాలని కలెక్టర్‌కు సూచించినట్లు తెలిసింది. స్కూల్ ఎడ్యుకేషన్ కలర్ కోడ్ అయిన గ్రీన్, బ్రౌన్, రెడ్ కలర్స్ వాడాలని చెప్పినట్లు సమాచారం. ఈ విషయం ఆలస్యంగా తెలియడంతో దీనిపై బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్‌ను వివరణ కోరగా.. తమకు ఎటువంటి సమాచారం రాలేదని చెప్పారు. కలెక్టర్‌తో మాట్లాడి ఆదేశాలను పాటిస్తామని స్పష్టం చేశారు.

జిల్లాకు ఐదు డైరెక్టర్ పదవులు

కడప (ఎర్రముక్కపల్లె), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం బుధవారం రాత్రి విడుదల చేసిన పలు కార్పొరేషన్ల డైరెక్టర్ల పోస్టులలో జిల్లాకు చెందిన ఐదుగురికి పదవులు దక్కాయి. ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పులివెందులకు చెందిన అన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి నియమితులయ్యారు. ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ డైరెక్టర్‌గా మైదుకూరుకు చెందిన పండితి మల్హోత్రా, ఏపీ గ్రంథాలయ పరిషత్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మైదుకూరుకు చెందిన తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి నియమితులయ్యారు. అలాగే ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పులివెందులకు చెందిన బోరెడ్డి జగన్నాథరెడ్డి, ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కడపకు చెందిన బాలిశెట్టి హరిప్రసాద్‌లను ప్రభుత్వం నియమించింది. కాగా తాను డైరెక్టర్ పదవిని స్వీకరించడం లేదని, తనకు డైరెక్టర్ పదవి ఇవ్వడం తమ సామాజిక వర్గం జీర్ణించుకోలేకపోతోందని అందువలన తాను ఆ పదవిని స్వీకరించడం లేదని బాలిశెట్టి హరిప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

17 బార్లకు దరఖాస్తుల ఆహ్వానం

- 15న ఎంపికలు


జీవో విడుదల చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

కడప క్రైం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాకు సంబంధించి రెండో విడత 17 బార్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు జయరాజు తెలిపారు. కడప నగరం ప్రకాశ్‌నగర్‌లోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. కడప జిల్లాకు 14 బార్లు, అన్నమయ్య జిల్లాకు మూడు బార్లకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, ఆసక్తి ఉన్నవారు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఒక బారుకు కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే వాటిని లాటరీ ద్వారా ఎంపిక చేస్తామని, నాలుగు కంటే తక్కువ వస్తే డ్రా తీయమని తెలిపారు. ఒక బార్‌కు రూ.5 లక్షలు దరఖాస్తు రుసుం చెల్లించాల్సి ఉంటుందని, మరో పదివేలు ప్రాసెస్ ఫీజు ఉంటుందన్నారు. ఈ నెల 14 వరకు దరఖాస్తుల స్వీకరణ, 15న ఉదయం కలెక్టరేట్‌లో కలెక్టరు శ్రీధర్ ఆధ్వర్యంలో లాటరీ ద్వారా బార్లను కేటాయిస్తామని డిప్యూటీ కమిషనరు వెల్లడించారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఎక్సైజ్ అధికారులు రవికుమార్, మధుసూదన్, సీఐ క్రిష్ణకుమార్ పాల్గొన్నారు.

12 మంది సర్పంచ్‌ల చెక్‌పవర్ రద్దు

- వైసీపీ పాలనలో రూ.లక్షల నిధులు దుర్వినియోగం



కడప రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట మండలంలోని 12 గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల చెక్‌పవర్‌ను రద్దు చేస్తూ బుధవారం పంచాయతీశాఖ జిల్లా అధికారి జి.రాజ్యలక్ష్మి ప్రొసీడింగ్ ఉత్తర్వులను జారీ చేశారు. సదరు పంచాయతీల చెక్‌పవర్‌ను డిప్యూటీ ఎంపీడీవోకు తాత్కాలికంగా అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఒంటిమిట్ట మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో రూ.లక్షల మేర 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు, సాధారణ నిధులు దుర్వినియోగం జరిగినట్లు ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనాలు వెలువడ్డాయి. ఆ మేరకు జమ్మలమడుగు డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌పీవో) విచారణ చేసి నివేదిక అందించారు. మండలంలో మొత్తం 13 గ్రామ పంచాయతీలకు గానూ గొల్లపల్లి, సాలాబాద్, ఒంటిమిట్ట, మంటపంపల్లి, నర్వకాటిపల్లి, పెన్నపేరూరు, కోనరాజుపల్లి, కొత్తమాధవరం, రాచగుడిపల్లి, చింతరాజుపల్లి, నడింపల్లి, గంగపేరూరు తదితర 12 గ్రామ పంచాయతీల్లో పెద్దఎత్తున నిధులను తప్పుగా వినియోగించినట్లు గుర్తించారు. ఈ మేరకు ఏపీపీఆర్ చట్టంలోని సెక్షన్ 42(1) కింద ఆయా గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల చెక్‌పవర్‌ను తొలగించారు. సెక్షన్ 42(3) కింద డిప్యూటీ ఎంపీడీవోకు తాత్కాలికంగా చెక్కు తీసుకొనే అధికారాన్ని అందించారు. ఏకంగా 12 మంది సర్పంచ్‌ల చెక్‌పవర్‌ను రద్దు చేయడంతో పొలిటికల్ కేడర్‌లో జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

అధికారులు అంకితభావంతో పనిచేయాలి

- అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంపై కలెక్టర్ ఆగ్రహం


మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే అర్జీల పరిష్కారంపై అధికారులు అంకితభావంతో పనిచేయాలని, నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలు, పెండెన్సీపై కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జడ్పీ సీఈవో ఓబులమ్మ, ఎస్డీసీ వెంకటపతిలతో కలిసి ఆయా డివిజన్ల ఆర్డీవోలు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పీజీఆర్ఎస్ వ్యవస్థ నిర్వహణపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తోందని, ముఖ్యంగా ప్రభుత్వ సేవలు, రెవెన్యూ అంశాలపై ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. ఈ ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారం అందడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత మండల తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారాలుండాలని ఆదేశించారు. అనంతరం అర్జీల పరిష్కారంలో వెనుకబడిన అధికారులపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విధి నిర్వహణలో వర్చువల్ గవర్నెన్స్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్షేత్ర విజిట్‌కు ప్రణాళిక ప్రకారం వెళ్లాలని, అవసరమున్న చోట్ల ఆకస్మిక తనిఖీలు కూడా నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం పబ్లిక్ గ్రీవెన్స్‌పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు జాన్‌ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, కమిషనర్లు పాల్గొన్నారు.

ఉల్లికి మద్దతు ధర

- జేసీ అదితిసింగ్

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉల్లి క్వింటాకు రూ.1200 మద్దతు ధర ప్రకటించిందని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్ఆర్ జిల్లాలో ఉల్లి పండించి, ఇ- క్రాప్ చేయించుకున్న రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేయుటకు మార్క్‌ఫెడ్ అనుమతిచ్చిందని, 4వ తేది నుంచి కొనుగోలు ప్రక్రియ ప్రారంభం అవుతుందని తెలిపారు. జిల్లాలో ఏఎంసీ కమలాపురం, ఏఎంసీ మైదుకూరులో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశామని, రైతులు తమ పంటలు ఇళ్ల వద్దే శుభ్రం చేసుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో ఉల్లి సాగు చేసిన రైతాంగం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె ఆ ప్రకటనలో కోరారు.

ముగ్గురికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు

కడప ఎడ్యుకేషన్/ప్రొద్దుటూరుటౌన్/కాశినాయన, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపిక చేసింది. ఉన్నత విద్యా మండలి, ఇంటర్మీడియట్, పాఠశాల విద్య పరిధిలో గల ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను రాష్ట్రస్థాయి ఎంపిక కమిటీ పరిశీలించి ఎంపిక చేస్తూ తుది నిర్ణయం తీసుకుంది. వీరికి సెప్టెంబరు 5న అవార్డులు అందజేయనున్నారు. ఎంపికైన వారిలో పెండ్లిమర్రి మండలం ఎగువపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎఫ్ఎంఎస్ ఖాదర్‌బాష, ప్రొద్దుటూరు లింగారెడ్డినగర్‌కి చెందిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎస్‌జీటీ ఉపాధ్యాయురాలు షేక్ జవహర్ మునీర్, కాశినాయన మండలం రెడ్డికొట్టాల మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల ఎస్‌జీటీ ఉపాధ్యాయురాలు బి.పరిమళ జ్యోతి ఉన్నారు.


గర్వంగా ఉంది

- జవహర్ మున్నీర్, ఉపాధ్యాయురాలు



ప్రొద్దుటూరుటౌన్ లింగారెడ్డినగర్ మండల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న నాకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించడం గర్వంగా ఉంది. నేను 1998 డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపికయ్యాను. 2021లోనూ నాడు-నేడు పనులను తక్కువ ఖర్చుతో తక్కువ సమయంలో ఎక్కువ పనులు చేసినందుకు జిల్లాలో ఉత్తమ ప్రధానోపాధ్యాయురాలిగా అప్పటి సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకున్నాను.

పురస్కారానికి ఎంపికవడం సంతోషాన్నిచ్చింది



పెండ్లిమర్రి మండలం ఎగువపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల హిందీ పండిట్‌గా పనిచేస్తున్న నాకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం సంతోషాన్నిచ్చింది. 1998లో నా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించాను. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల టెక్స్ట్ బుక్ రైటర్‌గా, ఏపీ రాష్ట్ర రీసోర్స్ పర్సన్‌గా మాడ్యుల్ రైటర్‌గా, ట్రైనర్‌గా సేవలందించాను. పిల్లల ప్రగతి కోసం నిరంతరం కృషి చేశాను.

- ఎఫ్ఎంఎస్ ఖాదర్, ఉపాధ్యాయుడు

ఉద్యోగ బాధ్యతను పెంచింది

- పరిమళ జ్యోతి, ఉపాధ్యాయురాలు



కాశినాయన మండలంలోని రెడ్డికొట్టాల ప్రభుత్వ అప్పర్‌ప్రైమరీ పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న నాకు ఉద్యోగ బాధ్యతను మరింత పెంచింది. 2006 డీఎస్సీలో ఎంపికైన నేను ఆర్‌జేడీ క్రిష్ణారెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే డా.సుధా చేతుల మీదుగా సావిత్రిబాయి పూలే అవార్డు, 2023లో డీఈవో రాఘవరెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించారు. 20 ఏళ్ల తన ఉద్యోగ ప్రస్థానంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం వరించడం ఆనందంగా ఉంది.

లింగ నిర్ధారణపై విచారణ

- కర్నూలుకు గర్భిణుల తరలింపు
- ప్రొద్దుటూరులో ఏజెంట్ల దందా వాస్తవమే
- వివరాలు వెల్లడించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత

7

చీటీ డబ్బులు వసూలు చేసి రూ. కోటి 80లక్షలతో మహిళ పరారీ

7

జగన్‌రెడ్డీ.. గాలిమాటలు మానుకో

- పులివెందులలో చీనీ, అరటి ధరలు తగ్గాయని గగ్గోలు తగదు
- ఎమ్మెల్సీ... రాంగోపాల్‌రెడ్డి


పాత్రికేయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

కడప మారుతీనగర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను గత కొన్నేళ్లుగా గాలిమాటలతో పులివెందుల ఎమ్మెల్యే జగన్‌రెడ్డి ముంచింది చాలదన్నటుగా ఇటీవల పులివెందుల పర్యటనలో కూటమి ప్రభుత్వం రైతులను నిండా ముంచిందంటూ మరో మారు అబద్ధాలు మాట్లాడడం మానుకోవాలని టీడీపీ ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి హితవు పలికారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బెంగుళూరు ప్యాలెస్ నుంచి నెలకోసారి బయటకు వచ్చి రాసుకొచ్చిన స్క్రిప్ట్‌తో నోటికి అడ్డూ అదుపూ లేకుండా మాట్లాడటం పరిపాటిగా మారిందన్నారు. ఆ కోవలో ఈ నెల 2న పులివెందుల చేరుకున్న జగన్‌రెడ్డి ఇక్కడి చీనీ, అరటి రైతులను కూటమి ప్రభుత్వం దగా చేస్తున్నదని, దీంతో ఈ ప్రాంత రైతులంతా తీవ్ర నష్టాలతో ఇబ్బందులు పడుతున్నారంటూ వాఖ్యలు చేయడం విడ్డూరంగా వుందన్నారు. జగన్‌రెడ్డి సీఎంగా వున్నప్పుడు పులివెందుల చీనీ రైతులకు లాభాలొచ్చినట్లుగా నిరూపిస్తే తాను బహిరంగ క్షమాపణ చెప్పడానికి సిద్ధమన్నారు. జగన్‌రెడ్డి కుటుంబ సభ్యులే గత కొన్నేళ్లుగా ఆ ప్రాంత చీనీ, అరటి, ఉల్లి రైతులను సూట్ పేరుతో దోపిడీ చేస్తున్నారని నిప్పులు చెరిగారు. దళారులకు వత్తాసు పలుకుతూ రైతుల నోట్లో మట్టి కొట్టి, ఇవాళ అదే రైతులు నష్టాలపాలవుతున్నారని చిలక పలుకులు పలకడం సరైంది కాదన్నారు. ఆయన అధికారంలో వెలగ బెట్టిన ఆ ఐదేళ్లలో ఆయన స్వంత నియోజకవర్గమైన పులివెందులలో అదనంగా ఒక్క ఎకరాకైనా సాగునీరు తెప్పించారా అని సవాల్ విసిరారు. రాష్ట్రంలో జరగనున్న మిగతా పంచాయితీ, కార్పొరేషన్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి విజయకేతనం ఎగురవేయడం తథ్యమన్నారు. సమావేశంలో టీడీపీ మీడియా కోఆర్డినేటర్ జనార్ధన్, నాయకులు బి.మైసూరారెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా రైతులకు యూరియా పంపిణీ చేయాలి : సబ్‌కలెక్టర్



అంకిశెట్టిపల్లె ఆర్‌ఎస్‌కే వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు డీలర్లకు సరఫరా అయ్యే యూరియాను కట్టుదిట్టంగా రైతులకు పంపిణీ చేయాలని సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి ఆదేశించారు. బుధవారం అంకిశెట్టిపల్లె ఆర్‌ఎస్‌కే వద్ద యూరియా పంపిణీని సబ్ కలెక్టర్ పరిశీలించారు. రైతులకు ఎన్ని బస్తాలు ఇస్తున్నారు, ఎంత స్టాకు వచ్చింది తదితర విషయాలను ఏఓ నవీన్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. 12 మెట్రిక్ టన్నుల యూరియా స్టాకు వచ్చిందని పాసుపుస్తకాలు తీసుకొచ్చిన రైతులకు ఒక్కో బస్తా పంపిణీ చేస్తున్నామన్నారు. కేవలం మదనపల్లె మండల రైతులకు మాత్రమే యూరియా ఇస్తున్నామన్నారు. అంకిశెట్టిపల్లె టీడీపీ ఇన్‌చార్జి జంగాల రమణ సబ్‌కలెక్టర్‌తో మాట్లాడుతూ అంకిశెట్టిపల్లెలో రెవెన్యూ సమస్యలు ఎక్కువగా వున్నాయని, రీసర్వే చేసిన వ్వుడు రికార్డుల్లో భూముల వివరాలు తప్పుగా నమోదు చేశార న్నారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పుల విషయమై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. వీటన్నింటిపై అర్జీ రాసి తీసుకొస్తే విచారించి ప్రజలకు న్యాయం చేస్తామని సబ్‌కలెక్టర్ సూచించారు.

ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించాలి

● డీపీఓ రాధమ్మ



పంచాయతీ అధికారులతో మాట్లాడుతున్న డీపీఓ రాధమ్మ

పీలేరు రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటి నుంచి రెండు రోజులకు ఒక సారి చెత్త సేకరించాలని డీపీఓ రాధమ్మ తెలిపారు. బుధవారం పంచాయతీలో చెత్త సేకరణపై ఆకస్మిక తనిఖీ చేపట్టిన ఆమె మాట్లాడుతూ శానిటేషన్‌పై తరచూ పీలేరు నుంచి ఫిర్యాదులు వస్తుంటాయని, ఇకపై సిబ్బంది, కార్మికులు పనితీరు మార్చుకోవాలని ఆదేశించారు. పంచాయతీలో 121 మంది వర్కర్లు ఉన్నప్పుడు ఇక సమస్య ఎందుకు ఉత్పన్నమౌతోందని ఇన్‌చార్జి ఈఓను ప్రశ్నించారు. క్షేత్ర స్థాయిలో పర్యటించాలని, కార్యాలయాలకే పరిమితమైతే ఇబ్బందులు తప్పవని చురకలంటించారు. తడి, పొడి చెత్తను విధిగా సేకరించాలన్నారు. పీలేరులో మినరల్ వాటర్ ప్లాంట్ల వర్కర్ల జీతాలు త్వరలోనే చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఈఓ లతీఫ్ ఖాన్, ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'హైవే' రైతులకు నగదు జమ

● ఖాతాల్లోకి విడతల వారీగా రూ.4.65కోట్లు



వేంపల్లెలో నేషనల్ హైవే రోడ్డు వేయనున్న భూములు ఇవే

వేంపల్లె, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాయచోటి-చాగలమర్రి నేషనల్ హైవే (440) రోడ్డుకు గాను వేంపల్లెలో భూములు, ఇళ్లస్థలాలు కోల్పోయిన వారికి పరిహారం ఖాతాల్లో జమ అయింది. వేంపల్లె మండలానికి సంబంధించి కడప రోడ్డు నుంచి పాపాఘ్ని నదీ ఒడ్డు మీదుగా గండిరోడ్డులోని పాలిటెక్నికల్ కళాశాల వరకు 5 కిలోమీటర్ల మేర రోడ్డుకోసం భూములు, ఇళ్లస్థలాలను ప్రభుత్వం సేకరించింది. వ్యవసాయ భూములకు ఎకరాకు రూ.34.11 లక్షల చొప్పున, ఇళ్ల స్థలాల్లో ఎకరాకు రూ.1.95కోట్ల చొప్పున పరిహారం నిర్ణయించారు. మొదటి విడతగా మంగళవారం రూ.4.65 కోట్లు ఖాతాల్లో జమ అయింది. 42.80 ఎకరాల వ్యవసాయ భూమి 16ఎకరాల మేర ఇళ్లస్థలాలు కోల్పోతున్నారు. ఇందులో ఇళ్లస్థలాలకు రూ.23 కోట్ల దాకా రావాల్సి ఉంది. వారికి ఇంకా నగదు జమ చేయలేదు. వ్యవసాయ భూములకు సంబంధించి 42.80 ఎకరాలకు గాను రూ.25.70 కోట్లు రావాల్సి ఉండగా ప్రస్తుతం రూ.4.65 కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయిందని నేషనల్ హైవే పర్యవేక్షణ ఇంజనీర్ సురేంద్ర తెలిపారు. మరికొద్ది రోజుల్లో మిగిలిన పరిహారం ఖాతాల్లో జమ అవుతుందన్నారు. ఈ రోడ్డును ఎస్‌ఎస్‌వీ సంస్థ టెండర్ దక్కించుకుంది. రైతులకు పరిహారం అందించిన తర్వాత పనులు మొదలుపెడతారని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

ప్రధాన చెరువులు నిండేనా...?

● కృష్ణా జలాల నీటి కోసం రైతుల ఎదురుచూపు

● పూర్తి కాని చెరువుల అనుసంధానం, కాలువ నిర్మాణ పనులు

పెద్దతిప్పసముద్రం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే ప్రధాన చెరువులుగా ప్రఖ్యాతి గాంచిన చెరువుల్లో కందుకూరు వ్యాసరాయ, పెద్దతిప్పసముద్రం, తిప్పరాయ, రంగసముద్రం రంగరాయ చెరువులు జిల్లాలోనే ప్రధాన చెరువులుగా మంచి గుర్తింపు పొందాయి. ఈ మూడు చెరువుల్లో నీరు ఉంటే ఏడాదికి మూడు పంటలు పుష్కలంగా పండుతాయి. అయితే వర్షాభావం కారణంగా చెరువుల్లోకి నీరు రావడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పడమటి మండలాల్లో ఒక్కటైన పెద్దతిప్పసముద్రం మండలంలోని ఈ మూడు చెరువులను కృష్ణాజలాలతో నింపాలని కందుకూరు వ్యాసరాయ సముద్రం చెరువు, పెద్దతిప్పసముద్రం తిప్పరాయసముద్రం సముద్రం చెరువులకు అనుసంధాన కాలువ పనులు ప్రారంభించారు. అయితే ఆ కాలువ నిర్మాణ పనులు ఎక్కడికక్కడ నిర్మాణ దశలోనే ఆగిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వంలో చెరువులను నింపుతామని అరకొరగా కాలువల్లో నీటిని విడుదల చేసి మిన్నకుండి పోవడంతో చెరువుల్లోకి నీరు విడుదల కలగానే మిగిలిపోయింది.



కందుకూరు వ్యాసరాయ సముద్రం చెరువు (ఫైల్)



పెద్దతిప్పసముద్రం తిప్పరాయసముద్రం చెరువు (ఫైల్)

పూర్తి కాని కందుకూరు చెరువు ఎత్తిపోతల పనులు

కందుకూరు వ్యాసరాయసముద్రం చెరువు జిల్లాలోనే అతిపెద్ద చెరువుల్లో ఒకటి. ఈ చెరువు 369.8 ఎంసీఎఫ్‌టీ సామర్థ్యం. ఎత్తిపోతల పథకం ద్వారా హంద్రీ-నీవా జలాలను ఈ చెరువును నింపాలనే ఉద్దేశ్యంతో కాలువ నిర్మాణాన్ని చేపట్టారు. అయితే ఆ కాలువ నిర్మాణం పనులు పూర్తి కాకుండానే అర్ధంతరంగా నిలిచిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వంలో కుప్పంకు నీటిని తరలిస్తున్నాం అని నానా యాగీ చేసి కాలువల్లో నీటిని వదిలి చెరువులన్నీ నింపి వ్యవసాయ భూములను సస్యశ్యామలం చేస్తామని వైసీపీ ప్రభుత్వం బీరాలు పలికింది. హంద్రీనీవా పుంగనూరు బ్రాంచి కెనాల్ పరిధిలోని తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు నియోజకవర్గాల్లో 78 చెరువులకు కాలువ ద్వారా కృష్ణా జలాలు అందించాల్సి ఉన్నా ఆ ప్రయత్నాన్ని చేపట్టలేదు. వేల కోట్లు ఖర్చు చేసి హంద్రీనీవా సుజలస్రవంతి కాలువలను నిర్మించారు. వైసీపీ ప్రభుత్వం ఎత్తిపోతల పథకాలు, కాలువల నిర్మాణాలకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. అయితే తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒకేసారి రూ.3800 కోట్లు మంజూరు చేసి లైనింగ్ పనులను పూర్తి చేసి కాలువలకు నీటిని విడుదల చేయడంతో రైతుల్లో ఆనందం నెలకొంది. గత ప్రభుత్వంలో చేయలేని పనిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసి చూపించాడని కనీసం ఈ కూటమి ప్రభుత్వంలోనైనా పడమటి మండలాల్లో ఉన్న ఈ మూడు ప్రధాన చెరువులకు నీటిని విడుదల చేస్తారని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

కృష్ణా జలాలతో చెరువులను నింపండి

చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి 7 లిఫ్టుల ద్వారా పుంగనూరు బ్రాంచి కెనాల్ మీదుగా అప్పినపల్లెకు, అక్కడి నుంచి కుప్పం ప్రాంతంలోని పరమసముద్రం చెరువుకు నీటిని తరలించేందుకు రెండు నెలలు పట్టింది. అయితే కూటమి ప్రభుత్వం కాలువలకు లైనింగ్ పనులను చేపట్టడంతో కృష్ణజలాలు అత్యంత వేగంగా కుప్పంకు తరలి వెళుతుండడంతో రైతుల్లో ఆశ చిగురిస్తోంది. చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి 150-200 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినా కుప్పంకు 10 క్యూసెక్కుల నీరు కూడా గతంలో చేరలేదు. సుమారు 400 కిలోమీటర్ల దూరం ప్రవహించాల్సి ఉన్నందున గతంలో నీరు వేగంగా సాగకపోవడంతో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం నెరవేరలేదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కాలువలకు లైనింగ్ పనులు చేయడంతో నీరు వేగంగా కుప్పం చేరుకుంటోంది. కుప్పం చెరువులు నిండాక కనీసం ఈసారైనా పెద్దతిప్పసముద్రం మండలంలో ఉన్న ప్రధాన చెరువులను నీటితో నింపుతారా లేదా అని రైతులు ఎదురు చూస్తున్నారు.

ప్రధాన చెరువులకు జలాలు విడుదల చేయండి

పెద్దతిప్పసముద్రం మండలంలోని ప్రదాన చెరువులను ఈ కూటమి ప్రభుత్వంలోనైనా కృష్ణా జలాలతో నింపాలని, కృష్ణా జలాలతో చెరువులను నింపితే రైతులు ఏడాదికి మూడు పంటలను సాగు చేసుకుని జీవనం సాగిస్తామని ఆయకట్టుదారులు కోరుతున్నారు. ముఖ్యంగా పెద్దతిప్పసముద్రం మండలంలోని ప్రదాన చెరువులైన కందుకూరు వ్యాసరాయ సముద్రం చెరువు, పెద్దతిప్పసముద్రం తిప్పసముద్రం, రంగసముద్రం రంగరాయ సముద్రం చెరువులకు నీటిని విడుదల చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

రంగసముద్రం చెరువుకు హంద్రీనీవా జలాలను మళ్లించండి

- చెన్నకేశవులు, రంగసముద్రం చెరువు సంఘం చైర్మన్



రంగసముద్రం రంగరాయ చెరువును గత పాలకులు విస్మరించడంతో రంగరాయ చెరువుకు హంద్రీ-నీవా జలాలు కలగానే మిగిలాయి. గత ప్రభుత్వంలో మండలంలోని అన్ని ప్రధాన చెరువులను హంద్రీ-నీవా నీటిని నింపుతామని ప్రగల్భాలు పలికిన పాలకులు రంగసముద్రం చెరువుకు నీటిని మళ్లించనే లేదు. రంగసముద్రం చెరువుకు నీటిని నింపితే సుమారు. 1500 ఎకరాల ఆయకట్టుదారులు పుష్కలంగా పంటలను సాగుచేసుకునేందుకు అవకాశం ఉంటుంది.

అడ్డుకున్నాడని.. పెట్రోల్ పోసి నిప్పుపెట్టారు

● రాయచోటి దుండగుల అరాచకం



పెట్రోల్ పోసిన దాడిలో గాయపడిన యువకుడు

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం బి.కె.పల్లెకు చెందిన ఓ వ్యక్తిపై, జిల్లా కేంద్రం రాయచోటికి చెందిన కొందరు దుండగులు పెట్రోల్ పోసి నిప్పంటించారు. బుధవారం తెల్లవారు జామున జరిగిన ఈ అమానుష ఘటనతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. మంటల్లో కాలుతున్న బాధితున్ని గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం వెంటనే స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ ప్రథమ చికిత్స అనంతరం బాధితున్ని మెరుగైన చికిత్స నిమిత్తం వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. పోలీసుల కథనం మేరకు..మదనపల్లె పట్టణం, టీకేపల్లెకు చెందిన షేక్ మహబూబ్‌బాషా, షేక్ ఖాసీంసాహెబ్ అన్నదమ్ములు. అయితే ఏడాది కిందట షేక్ మహబూబ్‌బాషా మృతిచెందాడు. షేక్ ఖాసీంసాహెబ్ రాయచోటిలో ఉంటున్నాడు. అయితే అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదాలు ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ క్రమంలో 15రోజుల కిందట రాయచోటిలోని ఖాసీంసాహెబ్ కుమారులు జావీద్‌బాషా, షామీర్‌బాషా మరికొంతమందితో వచ్చి మహబూబ్‌బాషా కుమారుడు సలీంబాషాతో ఘర్షణ పడ్డారు. తిరిగి బుధవారం తెల్లవారు జామున వచ్చి మరోసారి వివాదానికి ప్రయత్నం చేశారు. అయితే అదే ఇంట్లో అద్దెకు ఉంటున్న రమేష్‌నాయక్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించారు. తన బంధువైన షేక్ సలీంబాషాపై దాడి చేయడానికి వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే ఆయన ఇంటి పైభాగంలో ఉండడంతో అక్కడికి వెళ్లేందుకు గేటు అడ్డుగా ఉంది. ఈ క్రమంలో చుట్టుపక్కల శబ్దాలు చేస్తుండడంతో గమనించిన స్థానికులు అక్కడికి చేరుకుని సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వినలేదని సమాచారం. అంతలోనే రమేష్‌నాయక్‌తో పాటు సమీపంలోని మరో వ్యక్తిపై దాడి చేసినట్లు తెలిసింది. సంఘటనా స్థలానికి చేరుకున్న ఓ వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని కూడా ధ్వంసం చేసినట్లు చెబుతున్నారు. సలీంబాషా ఇంట్లో రమేష్‌నాయక్(39) బాడుగకు ఉంటూ ఐదేళ్లుగా అక్కడే జిరాక్స్ సెంటర్‌ను నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. వీరిని అడ్డుకున్న రమేష్‌నాయక్‌పై కోపోద్రిక్తులైన దుండగులు వెంటతెచ్చుకున్న పెట్రోల్ పోసి నిప్పు పెట్టి పారిపోయారు. మంటలు తాళలేక గట్టిగా అరవడంతో గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే మంటలను ఆర్పి స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు సంఘటన స్థలం వెళ్లి సంఘటనపై విచారణ చేపట్టారు. ఈ మేరకు టూటౌన్ సీఐ రాజారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని బాధితుని కుటుంబ సభ్యులు కోరారు.

వడ్డివారిపల్లెలో ట్రాక్టర్ చోరీ

రామసముద్రం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వడ్డివారిపల్లెలో మంగళవారం రాత్రి రైతు ట్రాక్టర్ చోరీకి గురైంది. గ్రామానికి చెందిన కట్టకింద శ్రీనివాసులు అనే రైతు పొలం పనులు ముగించుకుని యథావిధిగా రాత్రి ఇంటి పక్కనే తన ట్రాక్టర్ ఏపీ39 ఎంకే2633ను నిలిపి నిద్రిస్తున్న సమయంలో చోరీ జరిగినట్లు రైతు శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కలెక్టర్ నిర్ణయించిన ధరలు అమలు చేయాలి

● బొప్పాయి రైతుల వినతి



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాజంపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దళారు బొప్పాయి ధరలు తగ్గించి రైతుల పాలిట శాపంగా మారారని ఏపీ రైతుసంఘం, సీఐటీయూ నేతలు, బొప్పాయి రైతులు సబ్‌కలెక్టర్ భావనకు ఫిర్యాదు చేశారు. బుధవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతుసంఘం నేతలు నిరసన తెలియజేసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 6న బొప్పాయి రైతులు, దళారులతో చర్చించిన అనంతరం కలెక్టర్ చామకూరి శ్రీధర్ కిలో ధరను రూ.6 నుంచి రూ.10 చెల్లించాలని నిర్ణయించారన్నారు. ఆ ధరలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు సి.రవికుమార్, రాష్ట్ర రైతు సంఘం చిట్వేలి మండలాధ్యక్షుడు ఆదినారాయణ, ఈశ్వరయ్య, వెంకటరమణ, రైతు సంఘ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

రైల్వేకోడూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కెనరా బ్యాంకు ఆర్సీటీ కో-ఆర్డినేటర్ కె.సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు గిరిజమ్మ వీధిలో టైలరింగ్ శిక్షణ పొందుతున్న మహిళలకు ఉపాధి అవకాశాలపై గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ కె.పార్థసారధి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప శివారులోని కెనరా బ్యాంకు ఆర్సీటీ కేంద్రంలో ప్రతి నెల మహిళలకు టైలరింగ్, జ్యూట్, పెయింటింగ్, యువకులకు ఫొటోగ్రఫీ, డ్రైవింగ్, హౌస్ వైరింగ్ వంటి అంశాలపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. శిక్షణకాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయాలు, మెటీరియల్ కూడా ఉచితంగా ఇస్తారని తెలిపారు. ఈ నెల 26 నుంచి మహిళలకు టైలరింగ్, బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్‌పై నెల రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తారని తెలిపారు. 18 ఏళ్ల వయస్సు నిండిన కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉపాధి ద్వారా అభివృద్ధి చెందుటకు ట్రస్ట్ ద్వారా సహకారం అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కో-ఆర్డినేటర్ ముస్కీనా, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు కోర్టు ఏపీపీగా శివరామకృష్ణ నియామకం

కలికిరి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బద్వేలు అదనపు సహాయ సెషన్స్ జడ్జి కోర్టులో ఏపీపీగా న్యాయవాది డి.వి.శివరామకృష్ణను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్లపాటు ఆయన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కొనసాగనున్నారు. నెలకు రూ.25 వేల గౌరవ వేతనంతో శివరామకృష్ణను నియమిస్తున్నట్లు పేర్కొంటూ హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు.

పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో గణేశుడి నిమజ్జన ఉత్సవం





పోలీసు కుటుంబాల పిల్లలకు ఆటల పోటీలు ప్రారంభిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి, జిల్లా పోలీసు కార్యాలయం నుంచి వినాయకుడికి నిమజ్జనానికి తరలిస్తున్న పోలీసు సిబ్బంది

రాయచోటిటౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని బుధవారం నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా మహిళా పోలీసులు, జిల్లా పోలీసు కార్యాలయ మహిళా సిబ్బంది ఆటల పోటీలను అదనపు ఎస్పీ ఎం. వెంకటాద్రి జెండా ఊపి ప్రారంభించారు. మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్ విజేతలకు అదనపు ఎస్పీ ఎం. వెంకటాద్రి, ఏఆర్ డీఎస్పీ ఎం. శ్రీనివాసులు ఇతర ఉన్నతాధికారులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేలంలో లడ్డూను జిల్లా పోలీసు కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ మజ్జారి సునీల్‌కుమార్ రూ.57 వేలకు దక్కించుకున్నారు. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు. డప్పుల మోత, నృత్యాలతో ఊరేగింపుగా వినాయకుడి నిమజ్జనానికి తరలించారు. ఈ వేడుక విజయవంతానికి సహకరించిన సిబ్బందికి అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి కృతజ్ఞతలు తెలియజేశారు. విగ్రహ దాత ఏఆర్ పీసీ 427 కే. పరమేశ్‌కు అభినందనలు తెలియజేశారు ఏఆర్ డీఎస్పీ ఎం.శ్రీనివాసులు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ పీ.రాజారమేశ్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ ఎం.తులసీరాం, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు వీజే రామకృష్ణ, టీ.జాన్‌జోసఫ్, ఎం.పెద్దయ్య, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పోలీసు సిబ్బంది, పోలీసు కార్యాలయ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, హోంగార్డులు, పోలీసు కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పీలేరుకు సరిపడా యూరియా సరఫరా

● ఏడీ రమణరావు

పీలేరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తన పరిధిలోని పీలేరు, కేవీపల్లె మండలాలకు సరిపడా యూరియాలో 90 శాతం ఇప్పటికే సరఫరా చేశామని, పొరుగు మండలాల రైతుల కారణంగా పీలేరులో యూరియా కొరత ఉన్నట్లు వార్తలు వస్తున్నాయని వ్యవసాయ శాఖ ఏడీ రమణరావు పేర్కొన్నారు. పీలేరులో జరుగుతున్న యూరియా పంపిణీ తీరును బుధవారం తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ పీలేరు, కేవీపల్లె మండలాల్లో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో మామిడి తోటలతో సహా సుమారు 7 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారన్నారు. పీలేరు మండలానికి ఖరీఫ్ సీజన్ కోసం 305 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా మండలంలోని 12 రైతు సేవా కేంద్రాల ద్వారా 233 మెట్రిక్ టన్నులు, డీలర్ల ద్వారా మరో 130 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామన్నారు. మరో 80 మెట్రిక్ టన్నులు రెండు, మూడు రోజుల్లో వస్తున్నాయన్నారు. కేవీపల్లె మండలానికి 309 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా మండలంలోని 12 రైతు సేవా కేంద్రాల ద్వారా 294 మెట్రిక్ టన్నులు, డీలర్ల ద్వారా 20 మెట్రిక్ టన్నులు సరఫరా చేశామన్నారు. మరో 50 మెట్రిక్ టన్నులు వస్తున్నాయన్నారు. పీలేరు, కేవీపల్లె మండలాల రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. వారి అవసరాల మేరకు యూరియా అందుబాటులో ఉందన్నారు. పీలేరు, కేవీపల్లె మండలాలకు పొరుగున్న రొంపిచెర్ల, చిన్నగొట్టిగల్లు, సదుం, పులిచెర్ల, ఎర్రావారిపాళెం మండలాల రైతులు కూడా యూరియా కోసం పీలేరుకు వస్తుండడంతో కొరత ఉన్నట్లు కనిపిస్తోందన్నారు. అయితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక రైతులకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి యూరియా అందిస్తున్నామని, దీంతో పొరుగు మండలాల రైతులు నిరాశ పడుతున్నారన్నారు. అవసరమైన మేరకు రైతులు యూరియాను వినియోగించాలని ఆయన ఈ సందర్భంగా రైతులకు సూచించారు.



టోకెన్ల పంపిణీని పరిశీలిస్తున్న అధికారులు

బద్వేలులో యథేచ్ఛగా మట్టి తరలింపు

- బరితెగిస్తున్న మట్టి మాఫియా
- పగలు రాత్రి తేడా లేకుండా మట్టి తరలిస్తున్న వైనం
- చోద్యం చూస్తున్న అధికారులు



గొడుగునూరు చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిపోతున్న దృశ్యం

బద్వేలు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బద్వేలులో అక్రమ మట్టి తరలింపునకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. మట్టికి ఉన్న డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని మట్టి మాఫియా బరితెగిస్తోంది. కొండలు, గుట్టలు, చెరువుల్లో సైతం మట్టి తవ్వి యథేచ్ఛగా తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా చెరువుల నుంచి మట్టిని తవ్వి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా నూతనంగా నిర్మిస్తున్న ఇళ్ల కోసం తరలిస్తున్నారు. గ్రావెల్ (మట్టి)కు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని మట్టిమాఫియా పగలు, రాత్రి అనే తేడా లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాల సెలవు దినాలలో ఈ దందా సాగిస్తున్నారు.

బద్వేలు పట్టణం రోజు రోజుకు విస్తరిస్తున్న తరుణంలో ఇళ్ల నిర్మాణాలకు, అక్రమ లే అవుట్లకు అవసరమైన మట్టికి బాగా గిరాకీ ఉంది. మట్టి తవ్వేందుకు అనుమతులు ఉండి తరలిస్తే పర్వాలేదు. కానీ రాజకీయ పలుకుబడులతో రోజూ బద్వేలు, గోపవరం ప్రాంతాలలో మట్టి మాఫియా అక్రమంగా రోజుకు 200 టన్నుల మట్టిని తరలిస్తోంది. అక్రమ మట్టి తవ్వకాలకు కళ్లెం పడకపోతే ఆ ప్రాంతంలో చెరువులు, వంకలు వాటి స్వరూపాలే పూర్తిగా మారిపోయే దుస్థితి నెల కొంది. ఇదే జరిగితే వర్షపునీరు చెరువుల్లో చేరే పరిస్థితి గానీ, కొట్టే, గొప్పో చెరువుల్లో నీరు చేరినా బయటకు వచ్చే పరిస్థితి గానీ లేదు.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు తప్పవు

అనుమతి లేకుండా చెరువులలో మట్టి తర లిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. గొడుగునూరు చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లగా వెంటనే మట్టి తవ్వకాలను నిలుపుదల చేస్తామన్నారు.

-వేణుగోపాల్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ, బద్వేలు

రోజుకు 1200 ట్రాక్టర్ల మట్టి తరలింపు

బద్వేలు, గోపవరం ప్రాంతాల నుంచి రోజుకు దాదాపు 1200 ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా మట్టిని తరలిస్తూ లక్షలాది రూపాయలు సంపాదించడమే ధ్యేయంగా పెట్టుకున్నారు. బాకరాపేట చెరువు, శంకరాపురం, సగిలేరుతో పాటు ప్రభుత్వ భూముల నుంచి అక్ర మంగా మట్టిని తరలిస్తున్నారు. కొత్తగా ఇంటి నిర్మాణాలకు, అక్రమ లే అవుట్లకు ఈ మట్టిని తరలిస్తున్నారు. ప్రొక్లైన్లతో పగలు, రాత్రి అనే తేడా లేకుండా తవ్వకాలు జరిపి ట్రాక్టర్లు, టిప్పర్లతో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అయితే వీరికి రాజకీయ నాయకుల అండదండలు ఉండడంతో అధికారులు కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఏది ఏమైనా అక్ర మ మట్టి తరలింపునకు అడ్డుకట్ట వేయకపోతే చెరువులు, కుంటలు రూపురేఖలు లేకుండా పోతాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు అధికారులు మట్టి అక్రమ తవ్వకాల తరలింపుపై దృష్టిపెట్టి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భారీ స్కోర్ దిశగా కడప

- స్వల్ప వెనుకంజలో అనంతపురం



నాగచైతన్య, ప్రమోద్‌కుమార్, ప్రశాంత్

కడప స్పోర్ట్స్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-23 మెన్స్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ పోటీలలో భాగంగా బుధవారం వివిధ జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లలో కడప జట్టు 304 పరుగులతో భారీ స్కోర్ దిశగా సాగుతోంది. మరో మ్యాచ్‌లో అనంతపురం జట్టు స్వల్ప వెనుకంజలో వుంది. వివరాలిలా..... నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కడప-కర్నూలు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో టాస్‌నెగ్గిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 81 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 304 పరుగులు చేసింది. ఇందులో నాగచైతన్య 53 పరుగులు చేయగా విజయ్‌రామిరెడ్డి 62 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు.

కేఎస్ఆర్ఎం మైదానంలో నెల్లూరు-అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన నెల్లూరు జట్టు బ్యాటింగ్‌కు దిగి మొదటి ఇన్నింగ్స్‌లో 44.4 ఓవర్లలో 239 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో పవన్‌రిత్విక్ 50 పరుగులు, మాధవ్ 56 పరుగులు చేశారు. బౌలింగ్ విభాగంలో అనంతపురం జట్టు బౌలర్ ప్రమోద్ కుమార్ 5 వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 36 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 196 పరుగులు చేసింది. ఇందులో ప్రశాంత్ 90 పరుగులు, అర్జున్ టెండూల్కర్ 52 పరుగులు చేశారు. దీంతో అనంతపురం జట్టు మరో 43 పరుగుల స్వల్ప పరుగుల వెనుకంజలో వుంది.

ఫ్లెక్సీ తొలగింపు... ఇద్దరిపై ఫిర్యాదు

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిరసవంచ గ్రామంలో డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా అదే గ్రామానికి చెందిన జనసేన నేత అన్నలూ రు రవి గ్రామంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అదే గ్రామానికి చెందిన పాణ్యం రామాజనేయులు, పాణ్యం రవీంద్ర అనే వ్యక్తులు ఫ్లెక్సీలు తొలగించారని బుధవారం బి.మఠం స్టేషన్‌లో ఫిర్యాదు అన్నలూరు రవి ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు. విచారణ చేసి వారిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు.

చోరీలకు ప్రయత్నించిన వారిపై బైండోవర్‌కేసు

కలసపాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలుచోట్ల చోరీలకు ప్రయత్నించిన ఐదుగురు మహిళలు, ఒక యువకుడిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. చిత్తుకాగితాలు ఏరుకుంటూ మండలంలోని ముద్దంవారిపల్లె, మహానందిపల్లెల్లో ఇళ్లలో ఎవరూలేని సమయంలో చోరీకి పాల్పడుతున్నట్లు తెలిసి వారిని హెడ్‌కానిస్టేబుల్ నాగార్జున, ఎస్‌బి కానిస్టేబుల్ రిజ్వాన్ అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం అనుమానాస్పద వ్యక్తులుగా గుర్తించి వీరిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిమోతి తెలిపారు. వీరిని బుధవారం డిప్యూటీ తహసీల్దార్ మోహన్ రాజు వద్ద హాజరుపరిచారు.

చీటీ డబ్బులు వసూలు చేసి రూ. కోటి 80లక్షలతో మహిళ పరారీ

కడప క్రైం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో ఓ మహిళ చీటీల డబ్బుతో పరారైనట్లు తెలుస్తోంది. ఈమె నాగరాజుపేటలోని రవి థియేటరు సమీపంలో నివాసం ఉంటూ... చుట్టుపక్కల మహి ళలను కలుపుకుని ప్రైవేటు చీటీలు వేసుకుంటూ ఉండేది. గత కొంత కాలంగా చీటీల డబ్బులు దాదాపు రూ.కోటి 80 లక్షలు వసూలు చేసి... వారం రోజుల క్రితం ఇళ్లు ఖాళీ చేసి కుటుంబసభ్యులతో కలసి పరారైనట్లు తెలుస్తుంది. దీంతో బాధితులు బుధవారం కడప వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు.

హెడ్‌కానిస్టేబులుపై సస్పెన్షన్ వేటు

- ఎస్‌ఐకి చార్జ్ మెమో

కడప క్రైం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప నగరం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న పరమేశ్ అనే హెడ్‌కాని స్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ పోలీసు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈయనను రైల్వే కొండాపురం స్టేషన్‌కు బదిలీ చేశారు. హెడ్‌కానిస్టేబుల్ అక్కడికి వెళ్లకపోవడంపై ఉన్నతాధికారులు సీరియస్ అయినట్లు తెలుస్తుంది. దీంతో ఆయనపై సస్పెన్షన్ వేటు వేయడంతో పాటు ఎస్‌ఐకి చార్జి మెమోను అందించినట్లు సమాచారం.

ఉల్లి సాగులో మేలు రకం విత్తనాలు ఎంపిక చేసుకోవాలి

- జిల్లా ఉద్యానశాఖాధికారి రవిచంద్రబాబు



ఉల్లి పంటసాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యానశాఖాధికారి రవిచంద్రబాబు

కాశినాయన, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉల్లి పంటను సాగు చేసే రైతులు మేలు రకం విత్తనాలను ఎంపిక చేసుకోవాలని జిల్లా ఉద్యానశాఖాధికారి రవిచంద్రబాబు పేర్కొన్నారు. బుధవారం సావిశెట్టిపల్లె రైతు సేవా కేంద్రం పరిధిలో సాగుచేసిన ఉల్లి పంటను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో 14 వేల ఎకరాలలో ఉల్లి పంట సాగు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం కేపీ ఉల్లితో పాటు పెద్ద బళ్లారి, చిన్నబళ్లారి రకాలు సాగులో ఉన్నాయని.. పంట ప్రారంభం నుండే రైతులు సంకర రకాలను ఎంచుకొని అధికారుల సూచనలను పాటిస్తూ ముందుకు సాగాలన్నారు. బిందు సేద్య పరికరాలకు ప్రభుత్వం 50 నుంచి 90 శాతం సబ్సిడీ వరకు అందిస్తుందని.. వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతు స్థాయిలో పంట నిల్వచేసుకొనే గోదాములు లేకపోవడం వలన ఉల్లి పంట కోసిన వెంటనే అమ్ముకోవాల్సి వస్తుందని, ఆసమయంలో సరైన ధరలు లేకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఉద్యానశాఖ 50 శాతం సబ్సిడీతో ఉల్లి నిల్వ గోదాముల నిర్మాణం కోసం ముందుకు వచ్చిందని.. ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి రైతు తాను సాగుచేసిన పంటను తప్పక ఈక్రాప్ బుకింగ్ చేసుకోవాలని, పంట నమోదే అన్ని రకాల సహకారాలకు ప్రామాణికంగా తీసుకోవడం జరుగుతుందని తెలిజేశారు. కార్యక్రమంలో స్థానిక ఉద్యానాధికారి శ్రీనివాసులరెడ్డి, పలువురు సిబ్బంది, రైతుల పాల్గొన్నారు.

ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా కృషి చేయాలి

- పోలీసుల సమీక్షలో జడ్జి బాబాపక్రుద్దీన్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి బాబాపక్రుద్దీన్

కడప రూరల్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఉమ్మడి కడప జిల్లాలో సెప్టెంబర్ 13న నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌లో పోలీస్‌శాఖ నుంచి అధిక కేసులు రాజీ అయ్యేలా కృషి చేయాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాపక్రుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో డీఎస్పీలతో ముందస్తు లోక్ అదాలత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఎలాంటి ఖర్చు లేకుండా కక్షిదారులకు సత్వర న్యాయసేవలందించే లక్ష్యంతో సుప్రీం కోర్టు 1987లో న్యాయసేవాధికార సంస్థల చట్టాన్ని రూపొందించిందన్నారు. ఇలాంటి ప్రాముఖ్యత కలిగిన లోక్ అదాలత్ ను సెప్టెంబర్ 13న ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ మేరకు జిల్లా పోలీస్‌శాఖ నుంచి అత్యధిక కేసులు రాజీ అయ్యేలా తగు చర్యలు చేపట్టాలన్నారు. గత లోక్ అదాలత్ కంటే ఈసారి ఎక్కువ కేసులు పరిష్కరించేలా సహకరించాలన్నారు. లోక్‌అదాలత్ ప్రాముఖ్యతను కక్షిదారులకు వివరించాలన్నారు. వ్యక్తుల మధ్య తగాదాలను రాజీమార్గం ద్వారా పరిష్కరించడానికి పోలీసుల తోడ్పాటు చాలా అవసరమన్నారు. కక్షిదారులు లోక్ అదాలత్‌లో రాజీపడేలా అవగాహన కల్పించాలన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కారం అయ్యే కేసులకు ఎటువంటి ఖర్చు ఉండదన్నారు. సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. ఇక్కడ పరిష్కారం అయిన కేసు సుప్రీం కోర్టు తీర్పుతో సమానమైందన్నారు. తిరిగి అప్పీల్‌కు వెళ్లడానికి వీలుపడదన్నారు. లోక్ అదాలత్ పరిధిలోకి రాని కేసులంటూ ఏవీ లేవ న్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ల వారీగా కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో రాజంపేట ఆడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ యనోజ్ హెగ్డే, కడప, మైదుకూ రు, ప్రొద్దుటూరు, రాయచోటి సబ్ డివిజనల్ పోలీసు అధికారులు ఏ.వెంకటేశ్వర్లు, జి.రాజేంద్రప్రసాద్, పి.భావన, ఆర్.కృష్ణమోహన్, కడప కోర్టు మానిటరింగ్ సెల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

7న గండి ఆలయం మూసివేత

చక్రాయపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో వీరాంజనేయస్వామి ఆలయాన్ని ఈనెల 7వ తేదీ చంద్రగ్రహణం కారణంగా మూసివేయడం జరుగుతుందని ఆలయ సహాయ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తేదీ సాయంత్రం 4గంటల నుంచి ఆలయం మూసివేసి తిరిగి 8వ తేదీ సోమవారం తెల్లవారు జామున సంప్రోక్షణ చేసి ఉదయం 5గంటల నుంచి ఆలయాన్ని తెరిచి.. సుప్రభాతం, పుణ్యాహవాచనం, ఆలయశుద్ధి, స్వామివారికి పంచామృత అభిషేకం, ఆరాధన, నివేదన అనంతరం ఉదయం 7గంటల నుంచి స్వామివారి సర్వదర్శనం ప్రారంభం అవుతుందన్నారు.

ప్రొద్దుటూరులో శివాలయంలో...

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయాన్ని ఈనెల 7వ తేదీ సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా మూసివేస్తున్నట్లు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఈవో వెంకటసుబ్బయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం రాత్రి 9.50 గంటలకు చంద్రగ్రహణం ప్రారంభం అవుతుందని, సోమవారం తెల్లవారుజామున 3.41 గంటలకు గ్రహణం విడుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు స్వామివారికి మహానైవేద్యం సమర్పించి ఆలయాన్ని మూసివేస్తామని, సోమవారం ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, పుణ్యా ఆవాచనం, సంప్రోక్షణ తర్వాత భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరస్వామికి పూజలు



ఆలయంలో శాస్త్రోక్తంగా పవిత్ర పూజలు

జమ్మలమడుగు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఆలయ పండితులు, అధికారులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. పవిత్ర సమర్పణ కార్యక్రమాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత పూజతో ప్రారంభించి యాగశాలలో పుణ్యాహవాచనం, కుంభ ఆరాధన, తదితర పూజలు, హోమాలు చేశారు. అనంతరం యాగశాలలో పవిత్ర మాలలకు ఉపచారాలు నిర్వహించి ప్రదక్షిణగా స్వామివారి సన్నిధికి చేర్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో ప్రశాంతి, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారమే భోజనం

- సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టరు

కడప ఎన్టీఆర్‌సర్కిల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మెనూ ప్రకారమే విద్యార్థులకు హాస్టళ్లలో భోజన వసతి కల్పిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టరు కె.సరస్వతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

'మెనూ అలా .. ధరలు ఇలా .. అమలు ఎలా' అనే శీర్షికతో గత నెల 29న ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనానికి ఆమె స్పందించారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు ప్రభుత్వ నిర్దేశిత మెనూ ప్రకారం భోజన వస తి కల్పించడం జరుగుతుందని వివరించారు. అదేవిధంగా సహా య సాంఘిక సంక్షేమ అధికారుల ద్వారా విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

పులివెందుల కళాశాలలో సమస్యలు పరిష్కరించండి

- జేఎన్‌టీయూఏ వీసీకి మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి వినతి



జేఎన్‌టీయూఏ వీసీకి వినతి పత్రం ఇస్తున్న బీటెక్ రవి

అనంతపురంరూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏ అనుబంధమైన పులివెందుల ఇంజనీరింగ్ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి కోరారు. ఆ మేరకు ఆయన అనంతపురంలోని జేఎన్‌టీయూఏ వీసీ సుదర్శన్‌రావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. కళాశాలలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, పనుల గురించి చర్చించారు. రాబోయే కాలంలో యూనివర్శిటీ సర్వతోముఖాభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు పూర్తిగా ఉంటాయని పేర్కొన్నారు.

లింగ నిర్ధారణపై విచారణ

- కర్నూలుకు గర్భిణుల తరలింపు
- ప్రొద్దుటూరులో ఏజెంట్ల దందా వాస్తవమే
- వివరాలు వెల్లడించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత

ప్రొద్దుటూరు రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నో హెచ్చరికలు.. తనిఖీలు.. డయాగ్నోస్టిక్ సెంటర్లు, నర్సింగ్‌హోంల నిర్వహణపై నిఘా.. దళారీ వ్యవస్థపై డెకాయి ఆపరేషన్... ఇలా ఎన్ని చర్యలు చేపట్టినా లింగ నిర్ధారణ వెల్లడి దందా ఆగడంలేదు. ఈ వ్యవహారంపై జూలై 20వ తేదీ 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'లోకం చూడకనే... అనంత లోకాలకు...!' అనే కథనం ప్రచురితం అయింది. బహిరంగంగా సాగుతున్న ఈ బ్రోకర్ల దందా వ్యవహారంపై వైద్యాధికారులు తనిఖీలు చేసి వీటిని అరికట్టేందుకు డెకాయి ఆపరేషన్ కొనసాగిస్తామని వెల్లడించారు. ఈ వ్యవహారంలో అందిన ఫిర్యాదుల మేరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల ఆదేశాలతో బుధవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత ప్రొద్దుటూరులో దర్యాప్తు చేపట్టారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానికంగా లింగ నిర్ధారణ కట్టడి అయిందని, అయితే కొంతమంది దళారులు గర్భిణులను ఇక్కడి నుంచి కర్నూలుకు తరలిస్తున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. రూ.15వేలకు లింగ నిర్ధారణను దళారులు చేయిస్తున్నారని నిర్ధారణ అయినట్లు చెప్పారు. ప్రొద్దుటూరుకు చెందిన ఓ మహిళకు ఇది వరకే ముగ్గురు ఆడపిల్లల సంతానం. తన నాలుగవ కాన్పులో అయినా మగబిడ్డ కావాలనే ఉద్దేశ్యంతో లింగనిర్ధారణ వెల్లడి కోసం బద్వేలుకు చెందిన లత అనే ఏజెంట్ ద్వారా ప్రొద్దుటూరులోని స్టాఫ్ నర్సు రూతుని సంప్రదించారని చెప్పారు. జమ్మలమడుగు రోడ్డులోని ఓ ప్రైవేటు నర్సింగ్‌హోంలో పనిచేస్తున్న రూతు ఆ గర్భిణిని కర్నూలులోని ప్రసాద్ అనే ఏజెంట్ వద్దకు పంపారన్నారు. అతను ఓ ప్రైవేటు ఆస్పత్రిలోకి తీసుకెళ్లి స్కానింగ్ చేయించారన్నారు. అయితే ఆమె గర్భం దాల్చి కేవలం ఆరు వారాలు మాత్రమే కావడంతో లింగ నిర్ధారణ వెల్లడి కష్టమని.. మరో నెల తర్వాత లింగ నిర్ధారణ చేస్తామని కొంత మొత్తం డబ్బులను వసూలు చేసుకుని తిరిగి పంపించారన్నారు. అయితే ప్రొద్దుటూరుకు వచ్చిన ఆ గర్భిణికి అబార్షన్ అయిందన్నారు. ఆర్థికంగా వారు పేదవారు కావడంతో రూ.15 వేల కోసం రూతును నిలదీశారు. ఈ నేపథ్యంలో అందిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేయగా ఇక్కడి ప్రైవేటు ఆస్పత్రికి ఎలాంటి సంబంధాలు లేవని చెప్పారు. అయితే ఏజెంట్ల ప్రమేయం నిర్ధారణ అయినట్లు డాక్టర్ గీత వెల్లడించారు.



స్టాఫ్ నర్సు రూతుని విచారిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో గీత

ఏజెంట్లకోసం గాలింపు

ప్రొద్దుటూరు కేంద్రంగా సాగుతున్న లింగ నిర్ధారణ వెల్లడిలో కీలకపాత్ర పోషిస్తున్న నర్సులు, వైద్యరంగంలో ప్రమేయం ఉన్న మహిళలు ఏజెంట్ల అవతారం ఎత్తిన వ్యక్తుల గుట్టు రట్టు చేసేందుకు క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేపట్టామని వైద్యాధికారులు చెప్పారు. స్థానిక నర్సు రూతు, కర్నూలుకు చెందిన ఏజెంటు ప్రసాదు వివరాలను జిల్లా వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు కర్నూలు జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వోను అప్రమత్తం చేశారన్నారు. రెండు జిల్లాలకు చెందిన వైద్యాధికారులు ఏజెంట్లను పట్టుకునే చర్యలను చేపట్టినట్లు వివరించారు. చాపకింద నీరులా సాగుతున్న ఈ దందాపై స్పష్టమైన ఆధారాలతో తమకు సమాచారం ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె కోరారు.

కుక్కలతో ప్రజల బెంబేలు



చెన్నూరు పాతబస్టాండులో రాత్రివేళ కుక్కల గుంపు

చెన్నూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరులో కుక్కల సంచారం ఎక్కువైంది. వీధివీధినా కుక్కల గుంపులు ఎక్కువ కావడం, వాటితో ప్రజలు భయభ్రాంతులు కావడం సర్వసాధారణమైంది. చీకటి పడితే చెన్నూరు ప్రధాన రహదారి అయిన కొత్తరోడ్డు నుంచి పలుచోట్ల కుక్కలు గుంపులు కనిపిస్తూ ఆ దారిలో వెళ్లే వారిని వెంట పడుతున్నాయి. ఎక్కడ కుక్కలు తమ పిక్కలు కొరుకుతాయోనని వాటిని చూసిన ప్రజలు పరిగెత్తడం జరుగుతోంది. ముఖ్యంగా చెన్నూరు ఏపీజీబీ వద్ద, రామాలయం సమీపంలో, నాగలకట్టవీధి మలుపు, గోదినవీధి, చెన్నూరు పాతబస్టాండు, ప్రధాన రహదారిలో కుక్కలు నిత్యం రాత్రి 10గంటల తరువాత గుంపులుగా కనిపిస్తూ వెంటపడుతున్నాయి. కొందరు వ్యక్తిగత పనుల మీద ముఖ్యంగా పిల్లల చదువుల కోసం ద్విచక్ర వాహనాల్లో చెన్నూరు పాతబస్టాండు మీదుగా కొత్త రోడ్డు మీదకు వచ్చే సమయంలో, ఉద్యోగులు చెన్నూరుకు వచ్చి తిరిగి ఇతర నగరానికి వెళ్లేటప్పుడు కుక్కలు వారిని వెంట పడుతున్నాయి. సంబంధిత అధికారులు ఈ కుక్కలపై చర్యలు తీసుకుని ప్రజలు వాటి వల్ల ఇబ్బందులు పడకుండా చూడాలని కోరుతున్నారు.

రైతాంగ సమస్యలపై ప్రత్యక్ష పోరాటానికి సిద్ధం



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతాంగ సమస్యలపై ప్రత్యక్ష పోరాటానికి సిద్ధం కావాలని వైసీపీ శ్రేణులకు ఆ పార్టీ నేతలు పిలుపునిచ్చారు. బుధవారం కడప నగరం వైసీపీ జిల్లా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ రైతుల సమస్యల పట్ల ఈనెల 9వ తేదీన జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ జిల్లా పర్యటనలో జరిగింది ఏమీ లేదన్నారు. మహానాడు సమయంలో జిల్లాకు ఇచ్చిన హామీలు ఒక్కటి నెరవేర్చలేదన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లాఅధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, రమేష్‌యాదవ్, నాయకులు రామసుబ్బారెడ్డి, రఘురాంరెడ్డి, అంజాద్‌బాష తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రోజూ ఇంటింటా చెత్త సేకరణ జరగాలి

కమిషనర్ మనోజ్‌రెడ్డి



చెత్త సేకరణను పరిశీలిస్తున్న కమిషనర్

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 3 (ఆంధ్ర జ్యోతి): కార్పొరేషన్ పరిధిలో ప్రతిరోజూ ఇంటింటా చెత్త సేకరణ వంద శాతం జరగాలని కమిషనర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. బుధవారం కార్పొరేషన్ పరిధిలో మార్నింగ్ విజిట్‌లో భాగంగా నార్త్‌జోన్ పరిధిని సందర్శించారు. ప్రధాన రహదారులపై చెత్తను సమయానికి తొలగిస్తున్నారా లేదా అన్న విషయాన్ని స్వయంగా పరిశీలించారు. అలాగే వినాయక నిమజ్జన ప్రాంతాలలో పేరుకుపోయిన చెత్తను తొలగించిన విషయాన్ని ఆరాతీశారు. సంబంధిత నార్త్‌జోన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ప్రతిరోజూ ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ తప్పనిసరిగా జరిగేలా చర్యలు తీసుకోవాలని శానిటేషన్ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సకేంద్రాలు, మెడికల్ దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు



మందులను పరిశీలిస్తున్న డాక్టర్ మొహమ్మద్ తహ

వీరపునాయునిపల్లె, సెప్టెం బరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వీరపునాయునిపల్లెలోని ప్రథమ చికిత్స కేంద్రాలు, మెడికల్ షాపులను మండల వైద్యాధికారి డాక్టర్ మొహమ్మద్ తహ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆర్ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, వైద్యపరీక్షలు నిర్వహించడం, ప్రిస్కిప్షన్ పెట్టుకొని మందులు రాయడం, ల్యాబ్ టెస్టులు చేయడం, సెలైన్ బాటిల్లు ఎక్కించడం, నిబంధనలను అతిక్రమించి యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్ ఇంజక్షన్లు ఇవ్వడం చట్టరీత్యానేరమని తెలిపారు. ప్రతి మెడికల్ షాపులో తప్పనిసరిగా ఫార్మాసిస్టులు ఉండాలని కేవలం ఓవర్ ది కౌంటర్ డ్రగ్స్ తప్ప మిగతా మందులు ఏవీ కూడా అర్హత కలిగిన వైద్యుని ప్రిస్కిప్షన్ లేకుండా అమ్మరాదని హెచ్చరించారు. ఆర్ఎంపీ చికిత్స కేంద్రాలకు, మెడికల్ షాపులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని తెలిపారు.

పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వద్దు

చెన్నూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో పన్నులు వసూలు చేసేవిషయంలో ఉపేక్షించవద్దని, పాతబకాయిలతోపాటు పన్నులు వసూలు చేయాలని డిప్యూటీ ఎంపీడీవో సురేశ్‌బాబు కోరారు. ఈ మేరకు తన కార్యాలయంలో గ్రామపంచాయతీకార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు, డిప్యూటీ ఎంపీడీవో మాట్లాడుతూ ఇప్పటికే మండల వ్యాప్తంగా లక్షలాది రూపాయలు బకాయిలు ఉన్నాయన్నారు. అలాగే కొత్తగా ఇళ్లనిర్మాణం చేపట్టిన వారికి కూడా ఇంటిపన్నులు వేసి వసూలు చేయాలని కోరారు.

ఖాళీ స్థలాలు.. మురుగు కూపాలు..!

దోమలు, దుర్గంధంతో స్థానికులు సతమతం ● అంటూ వ్యాధులు ప్రబలే అవకాశం ● ఫాగింగ్ చేయరు... ఆయిల్ బాల్స్ వేయరు



పరమేశ్వర స్కూల్ ప్రాంతంలో నిలిచిన మురుగునీరు

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప నగరం వేగంగా విస్తరిస్తోంది. అయిదేళ్ల వైసీపీ పాలనలో ప్రణాళిక లేకుండా ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపట్టినా ప్రశ్నించేవారు లేకపోవడంతో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. ఈ క్రమంలో గతంలో జరిగిన లోపాలను సరి దిద్దడం ప్రస్తుతం తలకు మించిన భారంగా మారింది. ప్రధానంగా కాలనీల్లో జరిగిన నిర్మాణాల్లో నిబంధనల అతిక్రమణ ఒక ఎత్తయితే ఖాళీ స్థలాలను దశాబ్దాలుగా విడిచిపెట్టి మురుగు కూపాలుగా మార్చడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. దీనితో దోమలు, దుర్గంధంతో అవస్థలు పడుతున్నామని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



సన్ సిటీ ప్రాంతంలో ఖాళీగా ఉన్న స్థలంలో నిలిచిన మురుగునీరు

అప్రమత్తం కావాలి..: ఖాళీ స్థలాలు సంబంధిత యజమానులవే కావచ్చు వాటిపై సర్వహక్కులు వారికే ఉండొచ్చు. ఆ ప్రదేశాల్లో ఇప్పట్లో నిర్మాణాలు జరిపే ఉద్దేశం లేకున్నా వాటిని చదును చేసి నీరు నిల్వ ఉండకుండా ఎత్తు చేసుకోవాల్సిన బాధ్యత యజమానులపై ఉంది. కొత్త సమస్యలు తలెతకుండా యజమానులు అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది. రామరాజుపల్లె, రామాంజనేయ నగర్, సన్‌సిటీ, ఆచారి కాలనీ, జర్నలిస్ట్ కాలనీ, రామాంజనేయపురం వంటి ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది.

కొరవడిన పర్యవేక్షణ..: కడప నగరంలోని ప్రతి డివిజన్‌లో ప్రభుత్వ, ప్రైవేటు ఖాళీస్థలాలు ఉన్నాయి. నగరంలో వేల సంఖ్యలో ఖాళీస్థలాలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే పర్యవేక్షణ లేకపోవడంతో ఆయా ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు పెరిగాయి. వ్యర్థాలు, మురుగునీరుచేరి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. దోమల లార్వాలు పెరగకుండా మలాథియన్, ఆయిల్ బాల్స్ స్ప్రేయింగ్, గంబూషియా చేపలు వేయడం వంటిచర్యలు కానరావడం లేదు. ఫాగింగ్ చేస్తున్నామని అధికారులు చెబుతున్నా ఈ ప్రాంతాలకు రావడం లేదని స్థానికుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బైకులపై విన్యాసాలు చేస్తే చర్యలు

కడప క్రైం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : యువత ద్విచక్ర వాహనాలపై విన్యాసాలు చేసినా, రేస్ డ్రైవింగ్ చేసినా చర్యలు తీసుకుంటామని కడప వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణ హెచ్చరించారు. కడపనగరం బుగ్గవంక పక్కన ఉన్న రోడ్లపై కొంత మంది యువత బైకుపై విన్యాసాలు చేశారు. వారిని అదుపులోకి తీసుకుని వారి కుటుంబసభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ చేశారు. హరిటవర్స్, బుగ్గవంక పరిసర ప్రాంతాల్లో రాష్ డ్రైవింగ్‌కు పాల్పడ్డ ముగ్గురు యువకులు. లైసెన్సు లేకుండా వాహనాలు నడపడం ప్రమాదకరమని, పత్రాలు లేకుండా నడిపితే జరిమానాలతో పాటు జైలుకు పంపాల్సి వస్తుందని హెచ్చరించారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు కూడా బాధ్యత తీసుకుని వారిని గమనిస్తుండాలని సూచించారు.

పగటి కలగా మారిన పది పరీక్షల పారితోషికం

కడప ఎడ్యుకేషన్,సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు ,మూల్యాంకన విధులకు సంబంధించిన పారితోషికం పగటి కలలాగా మారిపోయిందని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు తెలిపారు. బుధవారం కడప జిల్లా విద్యాశాఖాధికారి షేక్ షంషుద్దీన్‌ను కలిసివినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏజాస్ అహమ్మద్, నాయకులు గాజులపల్లె గోపీనాథ్, బత్తుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవకు సత్కారం

కడప మారుతీనగర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భగవత్సంబంధమైన కార్యక్రమాలకు సేవలందిస్తున్న మహిళా మణులను సత్కరించుకోవడం భగవంతునిసేవగా భావిస్తున్నామని ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. జిల్లా రచయితల సంఘం, సనాతన ధర్మ సామూహిక ప్రార్థనా దేవాలయాల సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పాతకడప సనాతన ధర్మ సామూహిక ప్రార్థనా దేవాలయాల సంస్థ ప్రాంగణంలో ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ తిరుమల, శ్రీశైలం, ఒంటిమిట్ట తదితర పుణ్యక్షేత్రాలలో జరిగే ఉత్సవాలలో అనేకమంది మహిళలు స్వచ్ఛంద సేవలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పలువురిని సత్కరించారు.

సుపరిపాలనకు సహకరించండి

చెన్నూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు ఆదర్శ మండలంగా మారేందుకు వచ్చే నిధులతో అభివృద్ధి పనులు బాగా జరిగి ప్రతి పంచాయతీ ఆదర్శ పంచాయతీగా మారి సుపరిపాలన జరిగేందుకు సహకరించాలని టీడీప మండల కన్వీనరు విజయభాస్కర్‌రెడ్డి సచివాలయ సిబ్బందిని కోరారు. బుధవారం ఎంపీడీవో సభాభవనంలో గ్రామ సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి హాజరైన టీడీపీ కన్వీనరు మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రతి పంచాయతీకి లక్షలాది రూపాయలు నిధులు మంజూరై అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో గంగాదేవి, డిప్యూటీ ఎంపీడీవో సురేశ్ బాబు పంచాయతీలకు వచ్చిన నిధులపై చర్చించారు. కార్యక్రమంలో పలువురు సచివాలయ సిబ్బందిపాల్గొన్నారు.

బాడీఫ్రీజరు అందజేత

కమలాపురం రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కర్నాటి సుబ్బారెడ్డి, ఆయన సతీమణి కర్నాటి మునెమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు చంద్రశేఖర్‌రెడ్డి, నాగసుబ్బారెడ్డి, వెంకట సుబ్బారెడ్డి అభి చారిటబుల్ ట్రస్టుకు బుధవారం బాడీఫ్రీజరును ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్మన్ డాక్టర్ ఎస్.విజయబాబుకు ఈ ఫ్రీజరును అందించారు.

జిల్లా సైన్స్ కేంద్రాన్ని నూతనంగా ఏర్పాటుచేయాలి

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా సైన్స్ గ్రంథాలయ పునర్నిర్మాణం చేయాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాం డిమాండ్ చేశారు. బుధవారం కడప నగరం చెన్నూరు బస్టాండ్‌లో ఉన్న జిల్లా సైన్స్ కేంద్రాన్ని ఆయనతో పాటు గౌరవ సలహాదారుడు పీళ్లా కుమారస్వామిరెడ్డి సందర్శించారు. జిల్లా సైన్స్ కేంద్రం చాలా అధ్వానస్థితిలో ఉండడాన్ని చూసి వారు ఆందోళన చెందారు. జిల్లా సైన్స్‌కేంద్రం లోపలికి ప్రవేశించే ముందు అక్కడ ఒక టాయిలెట్ ఉండడం దాని దుర్వాసన లోపలికి కొడుతూ ఉండడం గమనించారు. కాగా జిల్లా సైన్స్ కేంద్రంలో అగస్త్య ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ జిల్లా సైన్స్ కేంద్రం భాగస్వామ్యంతో అనేక సైన్స్ పరికరాలను అక్కడ విద్యార్థుల కోసం ఉంచింది.కానీ కరోనా కాలం నుంచి ఎవరికీ ఆ పరికరాలను చూపించిన దాఖలాలు లేవు. అక్కడ విద్యార్థులు పోవడానికి కూడా అనుకూలమైన పరిస్థితులు లేకపోవడమే దీనికి కారణం. వెంటనే జిల్లా సైన్స్ మ్యూజియంలో పునర్నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు.

'చంద్రన్న పాలనలో మతఘర్షణలకు తావులేదు'

కడప మారుతీనగర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాగుతున్న కూటమి ప్రభుత్వ చంద్రన్న పాలనలో మత ఘర్షణలకు తావులేదని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూఖ్ సిబ్లీ పేర్కొన్నారు. బుధవారం స్థానిక రవీంద్రనగర్‌లోని మత పెద్దలు సయ్యద్‌షా మహ్మద్ తాహిరుల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభిమతానికి అనుగుణంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సుపరిపాలన అందిస్తున్నారన్నారు. సమావేశానంతరం సిబ్లీని తాహిరుల్లాతో పాటుగా మతపెద్దలు సత్కరించారు.

పదవీ విరమణ తప్పనిసరి

చక్రాయపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని మండల విద్యాశాఖ అధికారులు వెంకటసుబ్బయ్య, రవికిరణ్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ఉప్పలవాండ్లపల్లె ప్రధానోపాధ్యాయులు కె.రామచంద్రారెడ్డి పదవీ విరమణ చేశారు. ఆయనను శాలువాలు కప్పి సత్కరించారు.కార్యక్రమంలోఉపాధ్యాయులు, విద్యార్థులుపాల్గొన్నారు.

ఉల్లి రైతులను ఆదుకోవాలి

వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నష్టాలను చవిచూస్తున్న ఉల్లి రైతులను ఆదుకోవాలని మండల రైతు సంఘం ఉపాధ్యక్షుడు దేవిరెడ్డిమల్లికార్జున్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. అష్టకష్టాలు పడి ఉల్లి సాగు చేసిన రైతులకు తీరా పంట విక్రయించే సమయానికిధర లేక నష్టపోయారన్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర రూ.1200 కంటితుడుపు చర్య అన్నారు. క్వింటాకు రూ.3వేలు గిట్టుబాటు కల్పిస్తే రైతులు అప్పుల ఊబి నుంచి బయటపడతారన్నారు.

రైతులను ఆదుకోండి

వల్లూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రైతులు ఇప్పటికే దాదాపు కేసీ కెనాల్, బోరుబావుల కింద ఎత్తున వరి సాగు చేశారని ఎరువులను ప్రభుత్వం వెంటనే అందించాలని ఏపీయం రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారును కలసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా మాట్లాడతూ ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు ఆలస్యంగా కురిసినప్పటికీ ఇప్పటికే వరిసాగు చేశారన్నారు. వరిపంట కు కావాల్సిన యూరియా లేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే అందించాలన్నారు. జిల్లాఉపాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి ఆయన వెంట ఉన్నారు.

విద్యార్థినులకు కంటి పరీక్షలు

వేంపల్లె, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె ఏపీ మైనారిటీ గర్ల్స్ హైస్కూల్, తాళ్లపల్లె జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు బుధవారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఆఫ్తాల్మిక్ ఆఫీసర్ రెడ్డెన్న కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం ఉన్న వారిని గుర్తించారు. 31 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించామని వారికి కంటి అద్దాలు సరఫరా చేయడం జరుగుతుందని డాక్టర్ సుభాషిణి, డాక్టర్ నిహారిక, డాక్టర్ శాంతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటరత్నం, డిప్యూటీ హెచ్ఈఓ షఫీవున్నీస, ప్రిన్సిపాల్ సుగుణ,స్టాఫ్ నర్స్ అరుణ, సూపర్‌వైజర్ అంకయ్య, సీహెచ్‌ఓ ఫయాజ్, ఏఎన్ఎమ్, ఆశాలు పాల్గొన్నారు.

ఎల్ఐసీని బలోపేతం చేయడం దేశాన్ని బలోపేతం చేయడమే

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీని బలోపేతం చేయడం దేశాన్ని బలోపేతం చేయడమే అని ఎల్ఐసీ కడప డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ జి.కె.ఆర్.వి.రవికుమార్ అన్నారు.కడపలో బీమా వారోత్సవాల సందర్భంగా భారీ ర్యాలీ అనంతరం రవికుమార్ మాట్లాడారు. తొలుత ఎల్ఐసీ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. నాగరాజుపేట ఎల్ఐసీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ జియోన్, ఉమెన్స్ కాలేజ్, పాతబస్టాండ్, సెవెన్ రోడ్స్, క్రిస్టియన్ లేన్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా సాగి మళ్లీ ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయం వద్ద ముగిసింది.

నిధులు విడుదల హర్షణీయం

కడప రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేయడం హర్షణీయమని ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపు మునిరెడ్డి తెలిపారు. గ్రామ పంచాయతీలకు, మండల, జిల్లా పరిషత్తులకు రూ. 1121 కోట్లు తాజాగా ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఇందులో గ్రామ పంచాయతీ వాటా నిధులు వెంటనే సర్పంచుల ఖాతాల్లోకి జమచేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి క్రమం తప్పకుండా ఆర్థిక సంఘం నిధులు సర్పంచ్‌ల ఖాతాల్లోకి వస్తున్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రామ పంచాయతీ నిధులను దారి మళ్లించి పల్లె సీమల అభివృద్ధిని నిర్వీర్యం చేసిందన్నారు.

పంట నమోదు తప్పనిసరి



కమలాపురంలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

కమలాపురం రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ప్రభుత్వ పథకాలు అందాలంటే పంట నమోదు తప్పనిసరి అని ఏవో సరస్వతి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని గంగవరం,విభరాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మినుము, పెసర, వేరుశనగ, వరిపంట యాజమాన్య పద్ధతులను సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు సందీప్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సోనీ, గంగాదేవి, రైతులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్..: ప్రతి తమ పంటను నమోదు తప్పకుండా చేయించుకోవాలని ఏవో చెన్నారెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని అచ్చవెల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. చెన్నారెడ్డి మాట్లాడుతూ పంట నమోదు చేయించుకున్న రైతులకు మాత్రమే వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే పథకాలు వర్తిస్తాయన్నారు. జిప్సం, పనిముట్లు కావాల్సిన రైతులు తమను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వెంకటరమణారెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

లింగాల..: ప్రతిరైతూ ఈ-క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో రమేష్ తెలిపారు.మండలంలోని పార్నపల్లె గ్రామంలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో ఆకుముడత తెగులు సోకిందని వెంటనే ప్రొఫెనోఫాస్ మందును పిచికారీ చేయాలన్నారు.

స్త్రీలు ఆర్థికంగా బలపడాలన్నదే లక్ష్యం

ముద్దులు, హగ్గులు వద్దు.. సంక్షేమం, అభివృద్ధి కావాలి : ఎమ్మెల్యే మాధవి, పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్త్రీలు ఆర్థికంగా బలపడాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమని కడప ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముద్దులు, హగ్గులు ఇచ్చే ప్రభుత్వం వద్దని, సంక్షేమం, అభివృద్ధి చేసే ప్రభుత్వం ఉండాలని చెప్పారు. బుధవారం కడప నగరం అక్కాయపల్లె తెలుగుదేశం పార్టీ కార్యాలయ ప్రాంగణలో సూపర్ సిక్స్ - సూపర్‌హిట్‌లో భాగంగా అమలు చేస్తున్న స్త్రీశక్తి పథకం విజయోత్సవ సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి, ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మహిళల ఆత్మ గౌరవం, సాధికారత కోసం ప్రారంభించిన స్త్రీశక్తి పథకం కడపలో విజయవంతంగా అమలవుతుండడం గర్వకారణమని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించడం వలన కుటుంబ ఆర్థికభారం తగ్గిందని, ఇది నిజమైన స్త్రీ సాధికారతకు నిదర్శనమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.





హాజరైన మహిళలు, మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

అశ్వవాహనంపై శ్రీరంగనాథుడు



పులివెందుల రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలో రంగనాథస్వామి నూలుపూజ బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం స్వామి అశ్వవాహనంపై దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి అభిషేకాది ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారు సతీసమే తంగా అశ్వవాహనంపై దర్శనమివ్వగా భక్తులు దర్శించుకొని మొక్కుకున్నారు. ఉభయదారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలి

ముద్దనూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): బీసీల సంక్షేమం కోసం మండలానికి ఒక కమ్యూనిటీ హాల్‌ను ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం నాయకుడు సాకె రాధాకృష్ణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ అభ్యున్నతి అంటూ పార్టీలు చేస్తున్న వాగ్దానాలు ఓట్ల కోసం మాత్రమే పరిమితమయ్యాయన్నారు. కార్యక్రమంలో సాగర్ బాబు, కొండయ్య రామయ్య పాల్గొన్నారు.

బార్ అండ్ రెస్టారెంట్ కోసం దరఖాస్తు చేసుకోండి

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మైదుకూరులో బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహణ కోసం దరఖాస్తు చేసుకోవాలని మైదుకూరు ఎక్సైజ్ అధికారి ధీరజ్ కుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెలలో ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌కు మైదుకూరు పరిధిలో ఎవరూ స్పందించకపోవడంతో మళ్లీ రీ నోటిఫికేషన్‌కు అవకాశం ఇచ్చిందని తెలిపారు. ఈనెల 14వ తేదీలోపు బార్ అండ్ రెస్టారెంట్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు మిలాదున్ నబీ

జమ్మలమడుగు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మిలాదున్‌నబీ పండుగ సందర్భంగా పట్టణంలో గురువారం మహమ్మద్‌ప్రవక్త జ్ఞాపికాల ప్రదర్శన ఉంటుందని ఆస్తానయే గౌషియా పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌పీరా ఖాద్రి తెలిపారు. బుధవారం జమ్మలమడుగులోని పలగాడి వీధి మకాన్ వద్ద (దర్గా) ఆయన విలేకరులతో మాట్లాడారు. మహమ్మద్ ప్రవక్త జన్మించి నేటికి 1500 సంవత్సరాలు అయిందన్నారు. ఈ సందర్భంగా మహమ్మద్ ప్రవక్తను స్మరిస్తూ పట్టణంలోని పురవీధుల్లో శుక్రవారం శాంతియుత ర్యాలీ, అలాగే ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు.

భూమిరెడ్డి రామలక్షుమ్మకు డాక్టరేట్

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి పద్మావతి మహిళా యూనివర్సిటీ విద్యావిభాగంలో పనిచేస్తున్న భూమిరెడ్డి రామలక్షుమ్మకు అదే విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ)ఇన్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ పొందారు. ఈమె ప్రొఫెసర్ పి.రేణుక ఆధ్వర్యంలో 'ఉద్యోగ సంతృప్తి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సమస్యలపై పరిశోధన' అనే అంశంపై ఈ పీహెచ్‌డీ చేశారు. ఈమె వీఎన్ పల్లె మండలం గడ్డంవారిపల్లె స్వగ్రామం.

బైపాస్ రోడ్డు బాధితులకు న్యాయం చేయాలి



న్యాయం చేయాలని కోరుతున్న బాధితులు

జమ్మలమడుగు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని బైపాస్ రోడ్డు శివారెడ్డి కాలనీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న స్థలాల బాధితులకు నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని పలువురు విజ్ఞప్తి చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ 22 సంవత్సరాల నుంచి రోడ్డు పక్కన చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుని జీవిస్తున్నామన్నారు. అప్పట్లో అధికారులు డీకేటీ పట్టాలు శివారెడ్డి కాలనీ పేరుతో ఇచ్చారన్నారు. కొందరు ఇబ్బందులు పడి అమ్ముకున్నారని, మరికొందరు ఎన్ని ఇబ్బందులు వచ్చినా అక్కడే నివాసం ఉంటూ చిన్న చిన్న వ్యాపారాలు ఏర్పాటు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల బైపాస్ రోడ్డు వెడల్పు చేయుటకు వచ్చారని, గతంలో ఉన్న రోడ్డుకు సెంటర్‌పాయింట్ తీసుకుని ఇరువైపుల గతంలో ఇచ్చిన స్థలాల వరకు వెడల్పు చేసుకోవాలని కోరారు. అయితే ప్రజలకు ఇచ్చిన స్థలాల్లో నిర్దాక్షిణ్యంగా రోడ్డు వెడల్పులో భాగంగా ఇళ్లు కూల్చుతామని, వెంటనే ఖాళీలు చేయాలని చెప్పినట్లు బాధితులు వాపోయారు. ఈ నేపథ్యంలో ఓ మహిళ తమ స్థలంలో నష్టపరిహారం చెల్లించకుండానే రోడ్డు వెడల్పు చర్యలు చేపట్టితే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించడంతో అధికారులు వెళ్లిపోయారని వివరించారు. కాంట్రాక్టర్‌తో పాటు అధికారులు బాధితులకు ఇబ్బంది లేకుండా నష్టపరిహారం చెల్లించి తీసుకోవాలని కోరారు.

వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన భూపేశ్ రెడ్డి



మినరల్ వాటర్ ప్లాంటు కుళాయి తిప్పి ప్రారంభిస్తున్న భూపేశ్‌రెడ్డి

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దనపాడులో ఏర్పాటు చేసిన మినరల్‌వాటర్ ప్లాంట్‌ను జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. మెగా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సౌజన్యంతో ఈ వాటర్‌ప్లాంటును నిర్మించినట్లు పార్టీ వర్గాలు తెలిపారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి ఎం.మధుసూదన్‌రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ ఎం.మోహన్‌రెడ్డి, శివారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, ఎం.గోపాల్‌రెడ్డి, డి.రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి ఆడపిల్లే రేపటి అమ్మ

కొండాపురం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నేటి ఆడపిల్లే రేపటి అమ్మ అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి తెలిపారు. మండలంలోని బెడుదూరు గ్రామంలో బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాల్యవివాహాల గురించి కిశోరబాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది వెంకటసుబ్బమ్మ, అంకాలమ్మ, సరస్వతి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం చేయండి

కొండాపురం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): అంధత్వాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయాలని డాక్టర్ సాంబశివారెడ్డి తెలిపారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక పీహెచ్‌సీలో ర్యాలీ నిర్వహించారు. కంటి వైద్యురాలు లక్ష్మీదేవి మాట్లాడుతూ ఎవరైనా వ్యక్తి చనిపోతే వారి కుటుంబసభ్యులు నేత్రదానం చేసేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది లక్ష్మీదేవి, విజయమేరి, ఓబులేసు, మధు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్లకు ఏడాదికి రూ.25 వేల ఆర్థిక సహాయం అందజేస్తామని ఎన్నికల సందర్భంగా చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చాలని ప్రగతిశీల కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, జిల్లా కార్యదర్శి నాగేంద్ర డిమాండ్ చేశారు. బుధవారం చైతన్య ఆటో యూనియన్ ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్ వద్ద ఆటో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 15నుండి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేయడం వలన ఆటో కార్మికుల ఉపాధి మీద దెబ్బకొట్టిందన్నారు. ఉచిత బస్సుకు తాము వ్యతిరేకం కాదని, కానీ ఆటో కార్మికులు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో చైతన్య ఆటోయూనియన్ అధ్యక్షుడు సుదర్శన్, కార్యదర్శి ప్రతాప్, శరత్ కృష్ణ, హరి పాల్గొన్నారు.

మహిళలకు భద్రత అవసరం

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పని ప్రదేశాల్లో మహిళా ఉద్యోగులకు తగిన భద్రత అవసరమని వెంకటేశ్వర పశువైద్య కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ ఇందిర తెలిపారు. బుధవారం కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సేఫ్ వర్క్‌ప్లేస్ - స్మార్ట్ వర్క్‌ఫోర్స్ అన్న అంశంపై మహిళా అధ్యాపకులు, బోధనేతర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పోక్సో చట్టం 2023పై అవగాహన కల్పించారు. మహిళలు ఉద్యోగం చేసే ప్రదేశంలో వేధింపులు లేకుండా గౌరవం, భద్రత ఈ చట్టం ద్వారా కల్పించబడుతుందని తెలిపారు. మహిళలు ఏవైనా ఇబ్బందులు, వేధింపులు ఎదుర్కొంటుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మలేరియా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి మనోరమ ఆదేశించారు. బుధవారం ఎర్రగుంట్ల అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని మలేరియా వ్యాక్సినేషన్ సెంటర్లను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మలేరియా వ్యాధి వ్యాక్సినేషన్ రికార్డులను, మందులను పరిశీలించి తగిన సూచనలు చేశారు. పెండింగ్ ఉండకూడదని ఏఎన్‌ఎం, ఆశాలకు ఆదేశాలిచ్చారు. ఎలాంటి అవకతవకలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఓబులేసు, ఎంపీహెచ్‌ఈవో శంకర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు



వినాయకస్వామి సన్నిధిలో టీడీపీ నాయకులు

బద్వేలు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాలుగురోడ్ల కూడలిలో ఉన్న వినాయక విగ్రహాన్ని బుధవారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి ప్రసాదాలను స్వీకరించారు. ఆయన వెంట మున్సిపల్ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, సీనియర్ నాయకుడు ప్రసాద్, మణ్యం సుధాకర్‌రెడ్డి, నాగభూషణం, నిమ్మకాయల గోపాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు వేయాలి



కాలనీలో ఉన్న మట్టి రోడ్డు

జమ్మలమడుగు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని పెద్దపసుపుల రోడ్డులో టీచర్స్ కాలనీ 4వ లైను రోడ్డు దారుణంగా ఉంది. వర్షం వస్తే రోడ్డు పొడవునా అక్కడక్కడ వర్షపునీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంటుందని స్థానికులు తెలిపారు. గత ప్రభుత్వంలో సిమెంటు రోడ్డు నిర్మించాలని కోరడం జరిగిందని, కానీ ఫలితం లేదని వాపోయారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోనైనా 4వ లైనులో సిమెంటు రోడ్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ అధికారులు తమ రోడ్డును పరిశీలించి సిమెంటు రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరారు.

ప్రభుత్వ ధరలకే విక్రయించాలి



ఎరువు బస్తాలను పరిశీలిస్తున్న అధికారులు

ముద్దనూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయించాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శివన్న ఎరువుల దుకాణదారులకు సూచించారు. మండలంలోని ఎరువుల దుకాణాలను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అందులో భాగంగా ఎరువులు, పురుగుల మందులను పరిశీలించారు. ఎరువుల స్టాక్, అమ్మకం రికార్డులను తనిఖీ చేసి దుకాణంలో స్టాక్, ధరల పట్టికను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు కొన్న ఎరువులు, పురుగుల మందులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌వో మురళీకృష్ణ, ఏవో వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సొసైటీ కార్యాలయం మార్పు

చాపాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చాపాడులోని అల్లాడుపల్లె రైతు సేవా సహకార సొసైటీ కార్యాలయాన్ని అద్దె భవనంలోకి బుధవారం అధికారులు మార్చారు. ప్రొద్దుటూరు రోడ్డులో ఉన్న సుధాకర్ కాంప్లెక్స్‌లో ఈ కార్యాలయాన్ని తాత్కాలికంగా రెండేళ్ల పాటు ఏర్పాటు చేశారు. సహకార సొసైటీ చైర్మన్ మార్తల నరసింహారెడ్డి, డైరెక్టర్లు మేకల సుదర్శన్, గోసుల వీరారెడ్డి పూజలు చేశారు. ఒకరూము గోడౌన్‌కు, మరొక రూము ఆఫీసుగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఉన్న సహకార సొసైటీ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో ఈ అద్దె భవనంలోకి మార్చారు. కార్యక్రమంలో కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ గురివిరెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు వేమారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

ఖాజీపేట, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని సీడీపీవో శ్రీదేవి అన్నారు. బుధవారం మండల పరిధిలోని బాలుర బాలికల హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి సమస్యలు ఉన్నా 1098 నంబరుకు ఫోన్ చేయాలని, అలాగే విద్యార్థుల్లో చైతన్యం వచ్చినప్పుడే బాల్య వివాహాలను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎ.రమాదేవి, భారతి, సోషియల్ వర్కర్ లక్ష్మీప్రసన్న, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కష్టపడే వారికే టీడీపీలో పదవులు

ఖాజీపేట, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో కష్టపడితే పదవులు అవే వస్తాయని నాయీబ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, ఖాజీపేట మండల పరిశీలకుడు కొలవలి వేణుగోపాల్ అన్నారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కష్టపడిన వారికే పదవులు ఇస్తారని, ఇందుకు నిదర్శనం ఖాజీపేట టీడీపీ మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డికి గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్‌గా ఎంపిక చేయడమన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

కాశినాయన, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నర్సాపురంలో బుధవారం ఎంపీపీ నల్లేరు పోలమ్మ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం పేలవంగా సాగింది. ఈ సమావేశానికి కీలకమైన రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, హార్టికల్చర్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ తదితర మండల స్థాయి అధికారులు గైర్హాజరు కావడంపై ఎంపీడీవోతో పాటు పలువురు సర్పంచ్‌లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సభలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పేవారు లేకపోవడంతో గందరగోళ పరిస్థితి తలెత్తింది. ఈసందర్భంలో జోక్యం చేసుకున్న ఎంపీడీవో మైథిలీరెడ్డి మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశానికి కూడా మండల స్థాయి అధికారులు డుమ్మాకొట్టడం గర్హనీయమన్నారు. ఇకపై ఇలాంటి సంఘటనలు పునరావృత్తమైతే సహించేది లేదని, ప్రస్తుతం గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు నివేదిక పంపుతామన్నారు. అనంతరం హాజరైన అధికారులతో సమావేశాన్ని మమా అనిపించారు. సమావేశంలో జడ్పీటీసీ సత్యనారాయణరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య ఆచారి, ఈవోపీఆర్డీ ముజఫర్ రహీం, సర్పంచ్‌లు ప్రభాకర్‌రెడ్డి, గురయ్య, పిచ్చిరెడ్డి, చిన్నఖాజావలి సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ సంఘం జాతీయ సభలను జయప్రదం చేయాలి

అట్లూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కడప నగరంలో ఈనెల 8, 9, 10వ తేదీల్లో జరిగే అఖిల భారత వ్యవసాయ సంఘం జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు, అట్లూరు మండల అధ్యక్షుడు రమణయ్య తెలిపారు. మండలంలోని ఎస్.వెంకటాపురంలో బుధవారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం కమిటీ ఆధ్వర్యంలో ఈ మేరకు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సమావేశాలనకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శివ, నరసింహులు, మారయ్య, స్వప్న, సరస్వతి పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి

పోరుమామిళ్ల, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్మికులు, రైతులు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సీపీఎం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు దేశంలో పాలక ప్రభుత్వాల ప్రజావ్యతిరేక ఆర్థిక విధానాల అమలు కారణంగా దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గిందన్నారు. ఈనెల 8న కడప కొత్త ఆర్టీసీబస్టాండు వద్ద ఉన్న అంబేద్కర్ సర్కిల్ నుండి పాతబస్టాండు మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వరకు భారీ ప్రదర్శన, బహిరంగసభ ఉంటుందని, ఈ సభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచాలి

ప్రొద్దుటూరు రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ విధానంతో పాటు దాని వలన సమకూరే ప్రయోజనాలపై రైతుల్లో అవగాహన పెంచాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అన్నారు. బుధవారం ప్రొద్దుటూరు మండలంలోని కామనూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ అధికారులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీసీఎన్‌ఎఫ్ డీపీఎం ప్రవీణ్‌కుమార్ ప్రకృతి వ్యవసాయంలో పండించిన పంటలు ఆరోగ్యంతో పాటు భూమి పర్యావరణానికి ఎంతో మేలు చేకూర్చుతాయని రైతులకు వివరించారు. కషాయం తయారీ పద్ధతులను పరిశీలించి సూచనలు, మెలకువలు వివరించారు. అనంతర వారు ఎమ్మెల్యేను కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏవో వరహరి కుమార్, భరత్, ఆత్మా సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



ద్రవ జీవామృతాన్ని రైతులకు చూపుతున్న అధికారులు

చాపాడు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుందని మైదుకూరు ఏడీఏ క్రిష్ణమూర్తి, ఏవో పద్మలత తెలిపారు. పల్లవోలు, ఖాదర్‌పల్లె గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ద్రవ, ఘన జీవామృతం తయారు చేసే విధానాన్ని రైతులకు చేసి చూపించారు. ఈ పద్ధతి ద్వారా పండించే ఆహార ఉత్పత్తులతో ప్రజలు ఆరోగ్యవంతంగా జీవించవచ్చన్నారు. పంట దిగుబడి కూడా పెరుగుతుందని, పెట్టుబడి ఖర్చును చాలావరకు తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో వీఏఏలు సురేష్, సుష్మ, శిక్షకుడు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ అభివృద్ధి కోసం కార్యాచరణ



మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ నాయకులు

బద్వేలు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాయలసీమ అభివృద్ధి కోసం ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని సీపీఐ (ఎంఎల్) స్టాండింగ్ కమిటీ మెంబర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24న రాష్ట్ర స్థాయి సమావేశం జరుగుతుందని, ఇందులో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, నిరుద్యోగ సమస్య, ఉపాధిహామీ, సూపర్ సిక్స్ పథకాలపై చర్చించడంతో పాటు రాబోవు రోజులలో చేపట్టబోయే ఉద్యమ కార్యాచరణను తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జకరయ్య, ఏరియా సభ్యులు రామరాజు, బాబు, విజయరావు, నారాయణ, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

యువజన సంఘం అధ్యక్షుడిగా పుట్టా సాయిరామ్



మైదుకూరు రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మైదుకూరు యువజన సంఘం అధ్యక్షుడిగా పుట్టా వెంకట సాయిరామ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక అమ్మవారుశాలలో బుధవారం యువజన సంఘం నూతన కార్యవర్గ ప్రమాణాస్వీకారం జరిగింది. ఈ కార్యవర్గంలో అధ్యక్షుడిగా పుట్టా వెంకటసాయిరామ్, ఉపాధ్యక్షుడిగా మాలేపాటి అభిరామ్, తులసి సత్యసాయి, గుమ్మిడేల వైకుంఠ వాసు, ప్రధాన కార్యదర్శిగా కోట యశ్వంత్‌రాజ్, ఉప కార్యదర్శిగా కందుకూరి రాఘవేంద్ర, మల్లేముల వెంకటహరి ప్రసాద్, దర్శిసాయి ప్రశాంత్, కోశాధికారిగా భూపాలం ఉపేంద్రబాబు, ఉప కోశాధికారిగా ఇమ్మిడిశెట్టి ప్రశాంత్, దరిశా వెంకట అన్వేష్, కలువ సుమన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బల్లాని చెన్నకేశవ ప్రసాద్, పుట్టా శివ, పబ్బతి గోపాల్, సూరే సుబ్బరాజు, గూండా ఆనంద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

మైలవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను అసభ్య పదజాలంతో దూషిస్తున్న ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవోలు చిట్టిబాబు, శ్రీనివాసులుకు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ మండల పరిధిలోని దొమ్మరనంద్యాల జడ్పీ హైస్కూలులో విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు విద్యార్థులను అకారణంగా అసభ్యపదజాలంతో తిడుతున్నారనే ఆరోపణలు రావడం జరిగిందని, ఈ విషయమై విద్యార్థుల తల్లిదండ్రులనూ విచారించామని తెలిపారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ పోరుమామిళ్ల మండల శాఖ ఆధ్వర్యంలో గానుగపెంట జిల్లా పరిషత్ హైస్కూలులో బుధవారం సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ పెండింగు ఏడీలను, పీఆర్సీ, ఐఆర్ 30 శాతం ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. 2003 డీఎస్సీల వారికి ఓపీఎస్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ స్టేట్ కౌన్సిలర్లు సురేంద్రనాథరెడ్డి, సీతారామిరెడ్డి, రేణుక, కొండయ్య, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.